సంపుటి : 9
సంచిక : 362
గురువారం
24 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999

## తెగిపడిన విద్యుత్తు తీగలు

నిలిచిపోయిన పలు రైళ్లు



**తెనాలి, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** గుంటూరు జిల్లా తెనాలి రైల్వే స్టేషన్ వద్ద బుధవారం రైళ్లకు విద్యుత్తును సరఫరా చేసే తీగలు తెగి పడ్డాయి. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రైల్వే అధికారులు తెలి పిన సమాచారం ప్రకారం.. గుంటూరు నుంచి తెనాలి మిగతా .. 2లో..

నర్సాపూర్- చెన్నై వందే భారత్

## రైల్లో స్వల్ప అగ్నిప్రమాదం



**విజయవాడ, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** నర్సాపూర్-చెన్నై వందే భారత్‌రైలులో స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. నర్సాపూర్ నుంచి రైలు విజయవాడ చేరుకుంటున్న సమయంలో సీ-4 కోచ్ చక్రాల మధ్య యాక్సిల్‌లో స్వల్పంగా మంటలు వ్యాపించాయి. ఆపై పొగలు కమ్ము కున్నాయి. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా మిగతా .. 2లో..

## ఏపీ హైకోర్టులో ఐదుగురు అదనపు జడ్జిలకు శాశ్వత న్యాయమూర్తుల హోదా

కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు



**ఢిల్లీ, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా పనిచేస్తున్న ఐదు గురికి శాశ్వత న్యాయమూర్తుల హోదా కల్పించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం బుధవారం కేంద్రానికి సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు సిఫారసు చేసిన మిగతా .. 2లో..

ఏపీ ఇంటర్ 2027 పబ్లిక్ పరీక్షల ఫీజు

## షెడ్యూల్ విడుదల

సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 29 వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం

**అమరావతి, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో 2027లో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ విద్యామండలి విడుదల చేసింది. విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు ఈ గడువు తేదీలను గమనించి సకాలంలో ఫీజు చెల్లించాలని బోర్డు అధికారులు సూచించారు. విద్యామండలి వెల్లడించిన వివరాల ప్రకారం, ఎటువంటి అపరాధ రుసుము లేకుండా సాధారణ ఫీజు చెల్లింపునకు 2026 సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 29 వరకు అవకాశం మిగతా .. 2లో..



అమరావతిలో

# ప్రపంచ స్థాయి నేత్ర వైద్య కేంద్రం

- స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్య సాధనకు పాన్ ఐఐటీ నిపుణులు
- అమరావతిలో ఎల్వీ ప్రసాద్ ఐ సంస్థకు సీఎం చంద్రబాబు భూమి పూజ

**అమరావతి, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజధాని అమరావతిలో మరో ప్రతిష్ఠాత్మక సంస్థకు అడుగులు పడ్డాయి. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం వద్ద ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూమిపూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి నిర్మాణ పనులను ప్రారంభించారు. సుధా, వెంకట్ జాస్తి క్యాంపస్ పేరుతో 12 ఎకరాల్లో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌ను నిర్మించనున్నారు. ఏటా సుమారు 3 లక్షల మందికి కంటి వైద్య సేవలు అందించేలా ఆస్పత్రి నిర్మాణం కానుంది. చికిత్సలతో పాటు నేత్ర వైద్య పరిశోధన, శిక్షణ, కమ్యూనిటీ హెల్త్ కార్యక్రమాలపైనా సంస్థ దృష్టి సారించనుంది. ప్రత్యేకంగా ఐ అండ్ బ్రెయిన్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. భూమిపూజ అనంతరం బహిరంగ సభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి... శరవేగంగా నిర్మితమవుతున్న అమరావతికి ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ రావడం గర్వకారణమన్నారు. ఇప్పటికే 3 కోట్ల కంటి చికిత్సలు అందించిన సంస్థ అమరావతి నుంచి మరింత విస్తృతంగా సేవలందిస్తుందని తెలిపారు. అమరావతి కేంద్రాన్ని ప్రపంచంలోని అత్యుత్తమ నేత్ర వైద్య పరిశోధన సంస్థగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. కంటి చికిత్సలతో పాటు పరిశోధన, శిక్షణ రంగాల్లోనూ ప్రపంచస్థాయి కేంద్రంగా ఎదగాలని కోరారు. పేదలకు కంటి వైద్యం అందించడంలో ఎల్వీ ప్రసాద్ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని సీఎం పేర్కొన్నారు. నాలుగు రాష్ట్రాల్లో 319 కేంద్రాల ద్వారా సేవలు అందిస్తోందన్నారు. డిజిటల్ హెల్త్ ఐ ప్రొఫైల్ ద్వారా ప్రజలకు సకాలంలో చికిత్స అందించేలా సంస్థ పనిచేస్తోందని తెలిపారు. అమరావతిలో ఐ అండ్ బ్రెయిన్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న జీఎన్ రావు, జాస్తి వెంకట్‌లను సీఎం అభినందించారు.

**క్వాంటం కేంద్రంగా అమరావతి**

ఇప్పుడు అమరావతి గురించి దేశం అంతా మాట్లాడుతోందని...మన ప్రజా రాజధానిని ప్రపంచం కూడా గుర్తిస్తోందని సీఎం అన్నారు. నోపోల్ సిటీ, బ్లూ-గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ, కార్బన్ న్యూట్రల్, డీప్‌టెక్ క్యాపిటల్‌గా అమరావతిని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కాలుష్యరహిత నగరంగా తీర్చి దిద్దడంతో పాటు విస్తృతంగా హరిత ప్రాంతాలను మిగతా .. 2లో..

# గవర్నర్‌ను కలిసిన జగన్

- కూటమి ప్రభుత్వంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామన్న జగన్
- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్
- శాప్ కార్యాలయం వద్ద దాడి చేసి, బాధితులపైనే కేసులు పెట్టారని ఆరోపణ
- నకిలీ సర్టిఫికెట్లు, జీవోలతో నియామకాలు జరిపి తర్వాత రద్దు చేశారని వెల్లడి
- న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేసిన జగన్



**సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** డీఎస్సీ అక్రమాలపై విజయవాడలోని క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) కార్యాలయం వద్ద తమ పార్టీ నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారని, ఈ సందర్భంగా తమ నేతలపై దాడి జరిగిందని వైసీపీ అధినేత జగన్ నేడు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. డీఎస్సీ స్కామ్‌కు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని, ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని జగన్ డిమాండ్ చేశారు. గవర్నర్‌తో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్, డీఎస్సీ కుంభకోణం ఎలా జరిగిందో ఆధారాలతో సహా గవర్నర్‌కు వివరించినట్లు తెలిపారు. శాప్ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు మిగతా .. 2లో..

ఈనెల 27న రాజమహేంద్రవరంలో అంగరంగ వైభవంగా

## ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



**అమరావతి, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను పర్యాటక, సాంస్కృతిక కేంద్రమైన రాజమహేంద్రవరంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని తన ఛాంబర్‌లో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్. రావత్, టూరిజం ఎండీ పట్టాన్ శెట్టి రవి సుభాష్ లతో మంత్రి దుర్గేష్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర సాంస్కృతిక రాజధానిగా మిగతా .. 2లో..

విజయవాడలో దూండి గణపతి ఉత్సవాలకు

## హాజరైన మంత్రి నారా లోకేశ్



**విజయవాడ, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ నగరంలోని భవానీపురంలో దూండి గణేశ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా రాష్ట్ర ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా 72 అడుగుల భారీ మట్టి గణపతి విగ్రహాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి లోకేశ్‌తో పాటు ఈ పూజా కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇంఛార్జ్ బుద్దా వెంకన్న, మిగతా .. 2లో..

## 'బెంగాల్‌లో రీపోలింగ్ పెట్టాలి'

'సర్' వివాదం వేళ మమతా బెనర్జీ



**సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' అంశంలో ఎన్నికల సంఘం నిర్ణయాల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ స్పందిస్తూ.. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా, ఈసీ అక్రమాలకు పాల్పడ్డాయని ఇప్పుడు మిగతా .. 2లో..

ఉత్తరాంధ్ర తీరానికి చేరువైన

## తీవ్ర వాయుగుండం

అత్యంత భారీ వర్షాలు కురుస్తాయన్న ఐఎండీ



**సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఉత్తర కోస్తాంధ్ర తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. ఇది రానున్న కొద్ది గంటల్లోనే తీరాన్ని మిగతా .. 2లో..

## ఇంటి వద్దకే 'మీ సేవ'..

సర్వీసు ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇంటి వద్దకే మీ సేవ సర్వీసులు పేరిట మీ సేవ డోర్ డెలివరీ సర్వీసెస్‌ను ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. హైదరాబాద్ ఆర్టీసీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీనికి సంబంధించిన పోర్టల్‌ను శ్రీధర్‌బాబు లాంఛనంగా మిగతా .. 2లో..

## విజృంభించనున్న సూపర్ ఎల్‌నినో

మరింతగా భానుడి భగభగ



**సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ వ్యాప్తంగా పేద దేశాల్లో 'సూపర్ ఎల్‌నినో' తో లక్షల సంఖ్యలో ప్రాణాలు పోవడం ఖాయమని క్లైమెట్ ఇంపాక్ట్ ల్యాబ్ నివేదిక హెచ్చరిస్తోంది. 2026 సెప్టెంబర్ నుంచి 2027 ఫిబ్రవరి మధ్యలో కనీసం 4.5 లక్షల మంది ఎండ వేడికి చనిపోయే అవకాశం ఉందని పేర్కొంది. భారత్‌లో కూడా వేల సంఖ్యలో మరణాలకు అవకాశాలున్నాయని నివేదిక వెల్లడించింది. సాధారణ రోజుల్లో.. సగటున ఎంతమంది చనిపోతారనే ముందస్తు అంచనాకు ఇది అదనమని రిపోర్టు పేర్కొంది. 1996-2025ను బేస్‌లైన్‌గా తీసుకొని దీనిని తయారు చేశారు.

**భారీ మూల్యం చెల్లించుకొంటున్న పేద దేశాలు**

ప్రపంచ పేద దేశాలపై ఈ రిపోర్టు ఎక్కువ దృష్టి సారించింది. ఆఫ్రికాలోని 'సాహిల్ రీజియన్' (ఆఫ్రికా మధ్యలోని 9 దేశాల్లో ఐదువేల కిలోమీటర్లు విస్తరించిన ప్రాంతం)లో 66,800 మంది మిగతా .. 2లో..

డీల్స్ కోసం ట్రంప్ తహతహ..

## డీలాపడేలా జిన్‌పింగ్ నిర్ణయం



**సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** చైనా అధ్యక్షుడి అమెరికా పర్యటన ట్రంప్‌నకు మింగుడుపడేలా లేదు. జిన్‌పింగ్ నేటి నుంచి రెండ్రోజులపాటు యూఎస్‌లో పర్యటించనున్నారు. చైనా అగ్రనేతకు స్వాగతం పలికేందుకు స్వయంగా ట్రంప్ విమానాశ్రయానికి రానున్నారు. ఇంత చేస్తున్నా.. చైనా కంపెనీలతో భారీ డీల్స్ చేసుకోవాలనే మిగతా .. 2లో..

## జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బొత్స అనూష



**తాడేపల్లి, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ అధినేత జగన్‌ను భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ నూతన సమన్వయకర్త బొత్స అనూష మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె జగన్‌తో సమావేశమయ్యారు. ఇటీవలే భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుమార్తె అనూషను మిగతా .. 2లో..



(మొదటిపేజీ తరువాయి)

# అమరావతిలో ప్రపంచ స్థాయి నేత్ర వైద్య కేంద్రం

అభివృద్ధి చేసి, గ్రీన్ ఎనర్జీని వినియోగించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఐటీ తర్వాత క్వాంటం కంప్యూటింగ్‌పై దృష్టి సారించామని సీఎం తెలిపారు. దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం అమరావతిలో ఏర్పాటు అవుతోందన్నారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్అండ్‌టీ సంస్థల భాగస్వామ్యంతో 133 క్యూబిట్ సామర్థ్యం కలిగిన క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 21 క్వాంటం స్టార్టప్‌లు అమరావతిలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఐదు క్వాంటం కంప్యూటింగ్ సంస్థలు మూడు క్యూబిట్ కంప్యూటర్లను తయారు చేశాయని పేర్కొన్నారు. అక్టోబరు 3న వివిధ విశ్వవిద్యాలయాల్లో క్వాంటం కంప్యూటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

**రాజధానిలో రూ.50 వేల కోట్ల పనులు**

అమరావతిలో ప్రస్తుతం సుమారు రూ.50 వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని చంద్రబాబు తెలిపారు. ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్లు, స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి కీలక మౌలిక వసతులు రానున్నాయని చెప్పారు. విట్, ఎస్ఆర్ఎం, అమృతానందమయి సంస్థలు ఇప్పటికే వచ్చాయని, త్వరలో బిట్స్ పిలానీ క్యాంపస్, ఎక్స్ఎల్ఆర్ఐ వంటి సంస్థలు కూడా రానున్నాయని తెలిపారు. నాలెడ్జ్ ఎకానమీ, పరిశోధన, ఆరోగ్యం, మానవ అభివృద్ధికి కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామని సీఎం చెప్పారు. హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్‌లో భాగంగా బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వంటి ప్రముఖ సంస్థలు వస్తున్నాయని తెలిపారు. ఏఐ, ల్యాబొరేటరీ ఆటోమేషన్, ఎక్స్‌పెరిమెంటల్ బయాలజీ, క్వాంటం బయో వ్యాలీగా అమరావతి అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులను సీఎం మరోసారి అభినందించారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ, రైతుల త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. అమరావతిలో బ్యాంకింగ్ స్ట్రీట్ ద్వారా ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా రాజధాని రూపుదిద్దుకుంటుందని తెలిపారు.

**అక్టోబరు 3న పాన్-ఐఐటీ సదస్సు**

అక్టోబరు 3న విజయవాడలో పాన్-ఐఐటీ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు చంద్రబాబు తెలిపారు. దేశంలోని వివిధ ఐఐటీల్లో చదివి ప్రపంచవ్యాప్తంగా స్థిరపడిన నిపుణులు ఈ సదస్సులో పాల్గొని మేధోమథనం చేయనున్నారని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు పాన్-ఐఐటీ పనిచేస్తోందన్నారు. భవిష్యత్తులో ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలకు అమరావతి కేంద్రంగా మారుతుందని సీఎం అన్నారు. ప్రపంచ స్థాయి జీవన ప్రమాణాలు, పరిశోధనలకు గమ్య స్థానంగా రాజధాని నిలవాలని ఆకాంక్షించారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ కంటి వైద్యం, పరిశోధన, చికిత్స, శిక్షణలో ప్రపంచ స్థాయి కేంద్రంగా ఎదగాలని కోరారు. సాంకేతికత, అవకాశాలను యువత అందిపుచ్చుకుని ఆకాశమే హద్దుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి పి. నారాయణ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్ కుమార్, ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు జి.ఎన్ రావు తదితరులు హాజరయ్యారు.

# తెగిపడిన విద్యుత్తు తీగలు

మీదుగా రేపల్లె వెళ్లే ప్యాసింజర్ రైలు తెనాలి రైల్వే స్టేషన్ చేరుకుంటున్న క్రమంలో రైలు పై భాగంలోని విద్యుత్ తీగలు ఒక్కసారిగా తెగి రైలుపై పడి నిప్పు రవ్వలు ఎగిశాయి. దీంతో రైలు ఒక్కసారిగా నిలిచిపోయింది. ఈ పరిణామంతో రైలు, స్టేషన్‌లోని ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. 25 వేల ఓల్టుల విద్యుత్తు సామర్థ్యం కలిగి ఉన్న తీగలు ఒక్కసారిగా తెగిన క్రమంలో వాటికి విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. ప్రమాదాన్ని గమనించిన అధికారులు, నిపుణులు, సిబ్బంది రంగంలోకి దిగి రెండు గంటల పాటు శ్రమించి మరమ్మతులు పూర్తి చేశారు. డీజిల్ ఇంజిన్ సాయంతో పట్టాలపై ఆగి ఉన్న రైలును స్టేషన్‌కు తీసుకొచ్చారు. ప్రమాదం నేపథ్యంలో ఈ మార్గంలో పయనించే నిజాముద్దీన్-ఎర్నాకుళం, నిజాముద్దీన్ -మధురై, జోధ్ పూర్ చెన్నై, చెన్నై - పట్నా, తిరువనంతపురం- న్యూఢిల్లీ తదితర ఎక్స్ ప్రెస్ రైళ్లు, విజయవాడ- తెనాలి తదితర పాసింజర్ రైళ్లను వివిధ స్టేషన్లలో నిలిపి వేశారు. మరమ్మతుల అనంతరం రైళ్ల రాకపోకలు కొనసాగాయి. ప్రమాదం నేపథ్యంలో రైళ్ల రాకపోకల సమయాలు మారిపోవడంతో ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారు. అధికారులు స్టేషన్‌లోనే ఉండి ఎప్పటికప్పుడు మైకుల ద్వారా సమయాలు ప్రకటిస్తూ పర్యవేక్షించారు. స్టేషన్ మేనేజర్ వెంకటరమణ, ఇతర ఉన్నతాకారులు పనులను సమన్వయం చేశారు.

# రైల్లో స్వల్ప అగ్నిప్రమాదం

ఆందోళన చెందారు. రైలుని విజయవాడ ప్రధాన రైల్వే స్టేషన్‌లో నిలిపి వేశారు. సాయంత్రం 5 గంటలు దాటిన తర్వాత రైలు విజయవాడ చేరుకుంటున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అప్పటి నుంచి స్టేషన్‌లోనే వందే భారత్ రైలును నిలిపివేశారు. సిబ్బంది అగ్ని మాపక నియంత్ర పరికరాలతో మంటల్ని ఆర్పివేశారు. ప్రయాణికులంతా సురక్షితంగా ఉండటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మరో రైలులో ప్రయాణికుల్ని చెన్నై పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# షెడ్యూల్ విడుదల

కల్పించారు. ఈ గడువులోగా ఫీజు చెల్లించని విద్యార్థులు, రూ. 1,000 ఆలస్య రుసుముతో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 10 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

**పరీక్ష ఫీజుల వివరాలు ఇలా ఉన్నాయి:**

ప్రథమ లేదా ద్వితీయ సంవత్సరం థియరీ పరీక్షలకు: రూ. 600
రెండు సంవత్సరాల థియరీ పరీక్షలకు కలిపి: రూ. 1,200
సీనియర్ ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు: రూ. 275
బ్రిడ్జ్ కోర్సుకు: రూ. 165

నిర్ణీత గడువు ముగిసిన తర్వాత ఫీజు చెల్లింపు తేదీలను ఎట్టి పరిస్థితుల్లోనూ పొడిగించే ప్రసక్తే లేదని ఇంటర్ విద్యామండలి స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా ఫీజు చెల్లింపు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.

# గవర్నర్‌ను కలిసిన జగన్

అనుమతి తీసుకున్నప్పటికీ, అదే సమయంలో, అదే ప్రదేశంలో టీడీపీ గూండాలు ధర్నా నిర్వహించారని ఆరోపించారు. గతంలో 'సాక్షి' కార్యాలయాలపై దాడి చేసిన వారే ఈ దాడిలో పాల్గొని, నిరుద్యోగ యువత, వైసీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి పాల్పడ్డారని అన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బాధితులపైనే ప్రభుత్వం తీవ్రమైన సెక్షన్లతో కేసులు నమోదు చేయడం దారుణమని ఆయన విమర్శించారు. ఈ రెండు ఘటనలతో పాటు డీఎస్సీ పరీక్షల నిర్వహణ నుంచి అభ్యర్థుల నియామకాల వరకు జరిగిన అక్రమాల తీరును గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు జగన్ వివరించారు. ఎస్‌సీఈఆర్‌టీకి నేతృత్వం వహిస్తున్న ఒకే వ్యక్తికి ప్రశ్నపత్రం రూపకల్పన, పరీక్షల నిర్వహణ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ఈ పరీక్షల్లో ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంక్ వచ్చినా ఉద్యోగం ఇవ్వలేదని, ఇది ప్రశ్నపత్రం లీక్ అయిందనడానికి నిదర్శనమని వైసీపీ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రత్యేక జీవోలు జారీ చేసి, నియామకాలు పూర్తయ్యాక వాటిని రద్దు చేశారని, ఇది అక్రమాలకు బలమైన ఆధారమని జగన్ అన్నారు. కొందరు అభ్యర్థులు కనీసం టెట్ పరీక్ష కూడా రాయకుండానే ఉద్యోగాలు పొందారని, ఈ విధంగా 372 మందిని నిబంధనలకు విరుద్ధంగా నియమించారని ఆరోపించారు. టీడీపీ నేతల ఆధ్వర్యంలోని సాఫ్ట్‌బాల్, జూడో సంఘాలు జారీ చేసిన నకిలీ క్రీడా ధ్రువపత్రాలతో కొందరు ఉద్యోగాలు సంపాదించారని, ఈ విషయంలో శాప్, సంబంధిత సంఘాల మధ్య పరస్పర విరుద్ధ ప్రకటనలు వస్తున్నాయని తెలిపారు. ఉద్యోగాల అమ్మకాలకు సంబంధించిన ఆడియో, వీడియో ఆధారాలు సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని జగన్ విమర్శించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. అన్ని ఆధారాలు ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తి చూపుతున్నందున, మంత్రి లోకేశ్ రాజీనామా చేసి, సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో సుప్రీంకోర్టు చేసిన తీవ్ర వ్యాఖ్యలు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటివని జగన్ గుర్తుచేశారు. ఈ అక్రమాలపై న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# శాశ్వత న్యాయమూర్తుల హోదా

వారిలో జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్(టీసీడీ శేఖర్), జస్టిస్ చల్లా గుణరంజన్, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు పేర్లున్నాయి. రాష్ట్రపతి ఉత్తర్వుల జారీ తర్వాత వీరు శాశ్వత న్యాయమూర్తులుగా ప్రమాణం చేస్తారు. జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లు హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా 2024 అక్టోబరు 28న ప్రమాణం చేశారు. జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణరావులు 2025 జనవరి 24న అదనపు న్యాయమూర్తులుగా ప్రమాణం చేసిన విషయం తెలిసిందే.

# ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

విరాజిల్లుతున్న రాజమహేంద్రవరంలో పర్యాటక దినోత్సవ వేడుకలను ఘనంగా ఏర్పాటు చేయాలన్నారు. రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పర్యాటక శాఖ తరఫున చేపట్టాల్సిన ఏర్పాట్లు, టెంట్ సిటీలు, హోమ్ స్టేలు తదితర భక్తులకు మెరుగైన వసతుల కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రానికి ఇన్-బౌండ్ టూరిస్టుల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు సరికొత్త ప్యాకేజీలు, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.అదే విధంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల సౌందర్యాన్ని తెలిసేలా దేశంలోని ప్రధాన నగరాలతో పాటు విదేశాల్లోనూ రోడ్ షోలు నిర్వహించాలన్నారు. ఏడాదంతా నిరంతరం పర్యాటక శోభ ఉట్టిపడేలా వివిధ ప్రాంతాల్లో ఉత్సవాలు జరపాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ పథకాల ద్వారా మంజూరైన నిధులు, వాటితో జరుగుతున్న పనుల ప్రగతిని మంత్రి దుర్గేష్ సమీక్షించారు. త్వరలోనే మరిన్ని పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్) కేంద్రానికి సమర్పించి, అదనపు నిధులు రాబట్టేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. గంటకు పైగా సాగిన ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగం ద్వారా స్థానిక యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# హాజరైన మంత్రి నారా లోకేశ్

ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ తదితరులు పాల్గొన్నారు. దూండి గణేశ్ సేవా సమితి వ్యవస్థాపకులు దూండి రాకేశ్, ఇతర ప్రతినిధులు మంత్రికి స్వాగతం పలికి, స్వామివారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రతి ఏటా విజయవాడలో దూండి గణపతి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు. భారీ విగ్రహం, వైవిధ్యభరితమైన అలంకరణతో ఈ మండపం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఈ ఏడాది కూడా పర్యావరణ హితంగా 72 అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

# 'బెంగాల్‌లో రీపోలింగ్ పెట్టాలి'

రుజువైందన్నారు. పాత ఓటర్ల జాబితాతో రాష్ట్రంలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను అరెస్టు చేయాలన్నారు. ఈ వ్యవహారంపై చర్చించేందుకు 'ఇండియా' కూటమి త్వరలోనే సమావేశమవుతుందని వెల్లడించారు. మరోవైపు.. శివసేన (యూబీటీ) చీఫ్, మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే సైతం తమ రాష్ట్రంలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. విపక్షాల ఆరోపణలను భాజపా తప్పుపట్టింది. అధికారిక చర్చల్లో ఎన్నికల కమిషనర్లు భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేశారంటూ వచ్చిన కథనాలు.. ఈసీ ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేస్తోందనడానికి నిదర్శనమని తెలిపింది. ఎన్నికల సంఘం, ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయంటూ ఆరోపిస్తున్న ప్రతిపక్షాలన్నీ నేడు స్వీయ ఉచ్చులో చిక్కుకున్నాయని భాజపా అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర వ్యాఖ్యానించారు. "ఓట్ల తొలగింపుతోనే బెంగాల్‌లో భాజపా గెలిచిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ అవే నిజమైతే.. పెద్దమొత్తంలో ఓట్లు తొలగించిన 20 స్థానాల్లో.. భాజపా కేవలం ఆరు చోట్ల విజయం సాధించింది. ఓట్ల చోరీకి పాల్పడి ఉంటే.. సగానికిపైగా స్థానాలను ఎలా కోల్పోయాం?" అని ప్రశ్నించారు.

# తీవ్ర వాయుగుండం

దాటనుండటంతో ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) హెచ్చరించింది. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వాతావరణ శాఖ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం గడిచిన 6 గంటల్లో గంటకు 7 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. బుధవారం సాయంత్రం 5:30 గంటల సమయానికి ఇది ఉత్తరాంధ్ర తీరానికి అత్యంత సమీపంలో, కళింగపట్నానికి నైరుతి దిశగా 30 కిలోమీటర్ల దూరంలో, విశాఖపట్నానికి ఈశాన్యంగా 90 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం రానున్న 3 నుంచి 4 గంటల్లో విశాఖపట్నం, ఒడిశాలోని గోపాల్‌పూర్ మధ్య, కళింగపట్నానికి సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

**భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు**

వాయుగుండం ప్రభావంతో రాగల 24 గంటల్లో కోస్తాంధ్ర, యానాంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. ముఖ్యంగా, ఉత్తర కోస్తాంధ్రలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ సమయంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, కొన్నిసార్లు గాలి వేగం గంటకు 70 కిలోమీటర్లకు చేరుకోవచ్చని తెలిపారు. రాయలసీమలోనూ అనేక చోట్ల తేలికపాటి జల్లులు, అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చని వాతావరణ శాఖ పేర్కొంది. వాయుగుండం తీరం దాటిన తర్వాత క్రమంగా బలహీనపడుతుంది. సెప్టెంబర్ 24 తర్వాత వర్షాల తీవ్రత తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, మరో రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, బలమైన గాలులు కొనసాగవచ్చని అధికారులు సూచించారు. తీరప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో... విశాఖ, మన్యం, విజయనగరం జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

# ఇంటి వద్దకే 'మీ సేవ'..

ప్రారంభించారు. 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసినా లేదా మీసేవ పోర్టల్ ద్వారా స్లాట్‌ను బుక్‌చేసుకుంటే.. మీసేవ ఎగ్జిక్యూటివ్ ఇంటి వద్దకే వస్తారని పేర్కొన్నారు. ఇంటివద్దనే.. జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస సర్టిఫికెట్లు, ఈసీ కాపీలు, పోలీసు శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు.. ఇలా 'మీ సేవ' ద్వారా అందించే అన్ని ముఖ్యమైన పౌర సేవలు అందిస్తారని మంత్రి వివరించారు. ఇందుకోసం 70 మందికి పైగా మీ సేవ ఏజెంట్లు, మీ సేవ వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. తొలి దశలో 'క్యూర్' ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టామని.. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తామని మంత్రి చెప్పారు.

# విజృంభించనున్న సూపర్ ఎల్‌నినో

వేడిమి కారణంగా.. అదనంగా చనిపోవచ్చని వెల్లడించింది. వీటిల్లో 31,400 మరణాలు నైజీరియాలో, 17,500 మరణాలు సుడాన్‌లో, 10,000 మరణాలు నైజర్‌లో, 8,000 మరణాలు ఛాడ్‌లో నమోదు కావొచ్చని అంచనా వేసింది. ఇక ఆగ్నేయాసియాలో ఫిలిప్పీన్స్, వియత్నాం, థాయ్‌ల్యాండ్, కంబోడియాలో కలిపి సంయుక్తంగా 19,400 అదనపు మరణాలు నమోదు అయ్యే అవకాశం ఉంది. ఒక్క ఇండోనేసియాలోనే 19,300 మంది ప్రాణాలు కోల్పోతారని చెప్పింది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు తట్టుకోలేక.. భారత్‌లో 15,800, బ్రెజిల్‌లో 13,300 మరణాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారత్, పాకిస్థాన్ దేశాల్లో రానున్న వేసవిలో కూడా మరణాలు నిలకడగా పెరిగే ప్రమాదం ఉందని నివేదిక పేర్కొంది. ప్రభుత్వాలు ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకునేలా తమ నివేదిక ఉపయోగపడుతుందని ది క్లైమెట్ ఇంపాక్ట్ ల్యాబ్ వెల్లడించింది. ముందస్తుగా హీట్ వార్నింగ్స్ జారీ చేయడం, కూలింగ్ సెంటర్లు నిర్వహించడం, తాగునీటి సౌకర్యాలను పెంచడం, ఆరుబయట పనిచేసే ఉద్యోగులకు రక్షణ ఏర్పాట్లు కల్పించడం, ఆరోగ్య వ్యవస్థను సిద్ధం చేయడానికి ఈ అంచనాలు ఉపయోగపడనున్నాయి.

**2027లో కూడా వదలని ఎల్‌నినో..!**

ఇప్పటి వరకు ఎల్‌నినో పూర్తి స్థాయిలో ఏర్పడలేదు. సెప్టెంబర్ 3వ తేదీన ప్రపంచ వాతావరణ సంస్థ స్పందిస్తూ భవిష్యత్తులో ఎల్‌నినో మరింత బలపడుతుందని పేర్కొంది. దీని తీవ్రత నవంబర్, డిసెంబర్ నెలల్లో తారస్థాయికి చేరుతుందని అంచనావేసింది. 2027 ఫిబ్రవరిలో కూడా ఇది కొనసాగుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ భావిస్తోంది. భూమధ్య రేఖ వద్ద పసిఫిక్ సముద్రంలో ఉష్ణోగ్రత కూడా 1.8 డిగ్రీల సెల్సియస్ పెరగొచ్చని ఇప్పటికే అమెరికా నేషనల్ ఓషన్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. భూ ఉత్తరార్ధగోళంలో ఎల్‌నినో చాలా బలంగా ఉంటుందని ఈ సంస్థ వెల్లడించింది. 1901లో రికార్డుల నమోదు మొదలైన నాటి నుంచి.. ఈ ఏడాది ఆగస్టు నెల 'అత్యంత వేడిగా ఉన్న ఆగస్టు'గా నిలిచింది.

# డీలాపడేలా జిన్‌పింగ్ నిర్ణయం

ట్రంప్ లక్ష్యం మాత్రం నెరవేరేలా లేదు. అమెరికా పర్యటనకు జిన్‌పింగ్ ఒక్కరే వస్తున్నట్లు సమాచారం. ఆయన వెంట పారిశ్రామికవేత్తలు, సీఈవోలు ఎవరూ రావడంలేదని అమెరికా సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ట్రంప్-జిన్‌పింగ్ మధ్య గురువారం భేటీ జరగనుంది. దీనికి అమెరికా వైపు నుంచి టెక్ సంస్థల సీఈవోలు హాజరవుతున్నారు. వీరిలో జుకర్‌బర్గ్, జెన్సన్ హువాంగ్, శామ్ ఆల్ట్‌మన్, సత్య నాదెళ్ల, జెఫ్ బెజోస్, టిమ్ కుక్, ఎలాన్ మస్క్, సుందర్ పిచాయ్, మైఖెల్ డెల్, జెన్ ఫ్రేసెర్, జెమీ డిమోన్ వంటి దిగ్గజాలు హాజరుకానున్నారు. అయితే చైనా పక్షాన ఎవరూ రావడంలేదని వాల్‌స్ట్రీట్ జర్నల్ ఇప్పటికే కథనం వెలువరించింది. 2015లో ఇరు దేశాల మధ్య చర్చలకు జిన్‌పింగ్ పెద్ద ఎత్తున పారిశ్రామికవేత్తలను తీసుకొచ్చారు. కానీ, ఈ సారి ఆయన ఒక్కరే వస్తున్నారు. ఇరు దేశాల మధ్య రాజకీయ, ఏఐ, తైవాన్ అంశాల్లో నెలకొన్న ఉద్రిక్తతలు ఇటీవల తీవ్రంగా మారిన విషయం తెలిసిందే. అమెరికాలో మిడ్‌టర్మ్ ఎన్నికలు దగ్గరపడటంతో ట్రంప్ కార్యవర్గానికి ఈ భేటీ కీలకంగా మారింది. దీని పరిణామాలను ట్రంప్ విజయంగా చెప్పి.. ఎన్నికలకు వెళ్లే అవకాశాలున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వస్తే.. కాంగ్రెస్ ఉభయ సభల్లో రిపబ్లికన్ల పెత్తనానికి గండి పడే ప్రమాదం ఉంది.

**సొంతపార్టీలోనే ఆగ్రహం**

అమెరికా పర్యటనకు వస్తోన్న జిన్‌పింగ్‌కు ఘన స్వాగతం పలకాలన్న ట్రంప్ నిర్ణయంపై స్వపక్షంలోనే విమర్శలు వస్తున్నాయి. సెనెట్ ఆర్మ్‌డ్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ రోజర్ వికెర్ ఈ నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఆయన సెనెట్‌లో మాట్లాడుతూ 'శ్వేతసౌధం నన్ను సలహా అడిగితే.. జిన్‌పింగ్, కమ్యూనిస్టు పార్టీతో తమకున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని చైనా అధినేతను వాషింగ్టన్‌కు ఆహ్వానించొద్దని చెప్పేవాడిని. స్టేట్ డిన్నర్ వేళ చైనా సైనిక మోహరింపులు, ఇరాన్‌కు అందిస్తోన్న సాయంపై ట్రంప్ ఆరా తీయాలి. మన అతిథి నియంత అని.. అమెరికాపై ఆయుధాలు ఎక్కుపెట్టారని ట్రంప్ గుర్తించాలి' అని పేర్కొన్నారు.

# జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బొత్స అనూష

పార్టీ అధిష్ఠానం నియమించిన సంగతి తెలిసిందే. గతంలో ఇన్‌ఛార్జ్‌గా ఉన్న బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీని వీడటంతో, స్థానిక క్యాడర్‌ను ఏకతాటిపైకి తెచ్చి పార్టీని బలోపేతం చేసే బాధ్యతను జగన్ ఆమెకు అప్పగించారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో కీలక బాధ్యతను కట్టబెట్టినందుకు పార్టీ అధినేత జగన్‌కు అనూష ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భేటీ అనంతరం అనూష మాట్లాడుతూ... నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి, శ్రేణులను సమన్వయం చేస్తూ ముందుకెళ్లేందుకు శాయశక్తులా కృషి చేస్తానని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేస్తానని చెప్పారు.

# ఉత్తరాంధ్రకు తీవ్ర వాయుగుండం ముప్పు

## యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం రాష్ట్రం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ఈ తీవ్ర వాయుగుండం శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం-కవిటి మధ్య తీరం దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇది తీరం దాటే సమయంలో గంటకు 85 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పోలవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, జిల్లా కలెక్టర్లు, అధికారులు పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# ఎడిటర్ వాయిస్

## స్థానికంపై ఎన్నో సందేహాలు.. అంతుచిక్కని ప్రభుత్వ ఆలోచనలు

ఏపీలో స్థానిక ఎన్నికల హడావుడి ఎక్కువైంది. వచ్చేనెలలో మూడు రకాల స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేలా షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోందని చెబుతున్నారు. నవంబరు నెలాఖరులోగా మొత్తం ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయాలనే దిశగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని అంటున్నారు. అయితే ప్రభుత్వం ఎన్నిరకాలుగా సన్నద్ధం అవుతున్నా, ఎన్నికలకు న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం ఎక్కువగా ఉంది. బీసీ రిజర్వేషన్‌లను 34 శాతం చేయాలని ప్రభుత్వం భావిస్తుండగా, ఈ మేరకు రిజర్వేషన్ల అమలుకు రాజ్యాంగం అనుమతించదని చెబుతున్నారు. దీంతో ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రాష్ట్రంలో పంచాయతీలు, మున్సిపల్ పాలకవర్గాలకు మూడు నెలల క్రితమే గడువు ముగిసింది. గురువారంతో జిల్లా, మండల పరిషత్ పాలకవర్గాలకు గడువు తీరిపోతుంది. దీంతో ఆయా సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఓటర్ల జాబితా తయారు చేయడంతోపాటు వార్డుల విభజన, రిజర్వేషన్ల ప్రక్రియపై కసరత్తు చేస్తోంది. అయితే కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీ ప్రకారం బీసీ రిజర్వేషన్‌లను 34 శాతం పెంచుతూ ప్రభుత్వం తాజాగా ఆదేశాలిచ్చింది. దీనిప్రకారం చూస్తే మొత్తం రిజర్వేషన్లు 54 శాతానికి చేరుకుంటాయని అంటున్నారు. ఇది సుప్రీంకోర్టు గతంలో వెలువరించిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని అంటున్నారు. తెలంగాణలో సైతం ఇదే విధంగా 50 శాతం దాటి రిజర్వేషన్లు అమలు చేసేందుకు ప్రయత్నించగా, కోర్టు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎన్నికల ప్రకటన రద్దు చేసిందని గుర్తు చేస్తున్నారు.

తెలంగాణలో ఎదురైన అనుభవంతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏవిధంగా ముందుకు వెళుతుందనేది అంతుచిక్కడం లేదని పరిశీలకులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బీసీలకు 34 శాతం వార్డులను రిజర్వు చేసేలా అధికారులు అడుగులు వేస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఎవరైనా ఈ విషయంలో కోర్టుకు వెళితే అప్పుడు పరిస్థితిని ఎలా ఎదుర్కొంటారనేది చూడాల్సి వుందని అంటున్నారు. ఈ విషయంపై స్పష్టత వస్తేనే ఎన్నికలు జరుగుతాయా? లేదా? అనేది తేలుతుందని అంటున్నారు. అయితే రిజర్వేషన్ పెంపును కోర్టు అనుమతించని పక్షంలో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్‌లతోనే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తోందన్న వాదన వినిపిస్తోంది. అయితే ఇలా ప్రభుత్వం ఆలోచన మార్చుకున్నా వెంటనే ఎన్నికలు నిర్వహించే వాతావరణం కనిపించడం లేదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు బీసీలకు 34 శాతం కోటా కింద వార్డు రిజర్వేషన్లు ప్రకటిస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. అయితే ఈ విషయంలో ఇప్పటికే కోర్టులో విచారణ జరుగుతున్నందున కోర్టు నిర్ణయం కూడా ఎన్నికల నిర్వహణను ప్రభావితం చేయొచ్చని అంటున్నారు. భవిష్యత్తులో కోర్టు తీర్పు ప్రకారం నడుచుకుంటామని హామీ ఇచ్చి ప్రభుత్వం ముందుకు వెళ్లే ఆలోచన కూడా ఉందని అంటున్నారు. ఏదిఏమైనా న్యాయపరమైన చిక్కులు స్థానిక ఎన్నికల నిర్వహణపై అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. కానీ, ప్రభుత్వం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికల నిర్వహణకే కట్టుబడినట్లు ఉందని అంటున్నారు. రాష్ట్రంలో 50 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేయడంతోపాటు రెండేళ్లుగా విడుదల చేయని పింఛన్ల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవడం ఇందులో భాగమే అంటున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ వ్యూహంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం నుంచి రిమాండ్ ఖైదీ పరారీ



**చంచల్‌గూడ, విశ్వం వాయిస్ న్యూస్ :** పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న వ్యక్తి... మానసిక చికిత్స కోసం ఎర్రగడ్డ ఆసుపత్రికి తరలించగా పోలీసుల కళ్లు గప్పి పరారయ్యాడు. బోరబండ ఠాణా పోలీసులు తెలిపిన ప్రకారం... వనపర్తి జిల్లా అమరచింత మండలం నందిమల్ల గ్రామానికి చెందిన కిశోర్‌కుమార్‌రెడ్డి ఎలియాస్ శివశంకర్‌రెడ్డి(22) పోక్సో కేసులో అరెస్టై చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. మంగళవారం ఉదయం నలుగురు ఖైదీలను మానసిక చికిత్స నిమిత్తం పోలీస్ ఎస్కార్ట్ సహాయంతో ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాలయానికి తరలించారు. అక్కడ బాత్‌రూంకు వెళ్లిన అతడు లోపల వెంటిలేటర్ నుంచి దూకి పరారయ్యాడు. నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా జైలులో విచారణ ఖైదీగా ఉన్నప్పుడు జులై 6న జైలు గోడ దూకి పారిపోయాడు. తర్వాతరోజు ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా..పోలీసులు తిరిగి జైలుకు తరలించారు. అతడు మానసికంగా కోలుకునేలా.. ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స అందించేందుకు చంచల్‌గూడ జైలుకు జులై 10న తీసుకొచ్చారు.

## అనుమానాస్పద స్థితిలో నర్సింగ్ విద్యార్థిని మృతి



**జూలూరుపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** అనుమానాస్పద స్థితిలో నర్సింగ్ విద్యార్థిని తన ఇంటి వద్దనే మృతి చెందిన ఘటన మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వెంగన్నపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వెంగన్నపాలేనికి చెందిన ఇంద్రవెల్లి హరిణి(18) తనికెళ్ల సమీపంలోని ఓ నర్సింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. అక్కడే వసతిగృహంలో ఉంటూ ఇటీవల కొత్తగూడెంలోని తన పిన్ని ఇంటికి వెళ్లి మూడు రోజుల క్రితం వెంగన్నపాలెం వచ్చింది. సాయంత్రం 3 గంటల వరకు ఇంట్లో తల్లీకూతురు ఉన్నారు. తర్వాత తల్లి రాజేశ్వరి సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత తిరిగొచ్చి కుమార్తె కోసం చూశారు. ఇంట్లో కనిపించకపోవడంతో.. వెతుకుతూ ఇంటి వెనుక భాగంలోకి చూడగా మరుగుదొడ్డి పక్కన సందులో విగతజీవిగా పడి ఉండటాన్ని గమనించి కేకలు వేస్తూ చుట్టుపక్కల వారికి చెప్పారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి, ఎస్సై జీనత్‌కుమార్ యువతి మృతికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. మరోవైపు క్లూస్ టీం వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మరోవైపు యువతి చనిపోయిన ప్రదేశం చూస్తే ఎవరో హత్య చేసి పడేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. నుదిటి పైభాగంలో, ముక్కు కింద గాయాలైనట్లు కనిపిస్తోందని, మెడపై నులిమినట్లుందని.. దీనిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక.. స్పష్టత వస్తుందని పోలీసులు చెబుతున్నారు. మృతురాలి తండ్రి మూడేళ్ల క్రితం మృతి చెందారు.

## రైలు ఢీకొని నలుగురు విద్యార్థుల దుర్మరణం



**టెక్కలి, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకాకుళం జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. టెక్కలి సమీపంలోని బర్మా కాలనీ వద్ద ఐదుగురు ఇంటర్ విద్యార్థులను రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు దుర్మరణం పాలవగా.. మరొకరికి గాయాలయ్యాయి. విద్యార్థులు నౌపడ నుంచి బయల్దేరి టెక్కలి వైపు రైల్వే ట్రాక్‌పై నడిచి వెళ్తుండగా రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొట్టింది. గాయపడిన విద్యార్థిని టెక్కలి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

ఆదిలాబాద్ రిమ్స్ ఘటన..

## మరో ఇద్దరు పసికందుల మృత్యువాత

**ఆదిలాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదిలాబాద్ రిమ్స్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో మరో ఇద్దరు పసికందులు మృతిచెందారు. ఇప్పటికే ముగ్గురు మృతిచెందగా.. తాజా మరణాలతో ఆ సంఖ్య ఐదుకు చేరింది. రిమ్స్‌లో సోమవారం అర్ధరాత్రి విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్, ఏసీ పేలడంతో అగ్నిప్రమాదం సంభవించిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంపై విచారణకు కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది.

## విద్యుదాఘాతంతో భార్యాభర్తల మృతి

**దేవరకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** నల్గొండ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. విద్యుదాఘాతంతో వృద్ధ దంపతులు మృతిచెందారు. దేవరకొండ పట్టణం అంజయ్య కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో భార్య సోఫియా బేగం (60) టేబుల్ ఫ్యాన్ స్విచ్ వేస్తుండగా.. కరెంట్ షాక్ కొట్టడంతో భర్త మహమ్మద్ దావుద్ మియా (80) కాపాడబోయారు. దీంతో ఇద్దరూ విద్యుదాఘాతానికి గురై మృతిచెందారు. మృతదేహాలను దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## పిడుగుపాటుకు ఇద్దరు రైతుల మృతి

### రెండు వేర్వేరు చోట్ల ఘటనలు

**ఓదెల, చొప్పదండి, విశ్వం వాయిస్ న్యూస్ :** పిడుగుపాటుకు గురై మంగళవారం వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు రైతులు మృతి చెందారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూరుకు చెందిన జంగ సుధాకర్‌రెడ్డి(68) గ్రామంలోని తన వ్యవసాయ పొలం వద్ద పని చేసుకుంటుండగా మధ్యాహ్నం వర్షపు జల్లులు పడ్డాయి. దీంతో పక్కనే ఉన్న మామిడి చెట్టు కిందకు వెళ్లారు. ఈ క్రమంలో పిడుగుపడి మృతి చెందారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం చాకుంట గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యురాలు గోపు మంగమ్మ భర్త గోపు నరేందర్‌రెడ్డి(60) సాయంత్రం పొలం వద్దకు వెళ్లారు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా పిడుగుపాటుకు గురైన గాయాలతో మృతి చెంది కనిపించారు.



# విశ్వంవాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




గురువారం, 24 సెప్టెంబర్, 2026

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమూజ బాధ్యత

www.viswamvoice.com




విశ్వంవాయిస్ కథనంపై స్పందన..

## చెత్తలో పడేసిన మందుల ఘటనపై

# విచారణ

- బ్యాచ్-4310పై ఆరా..
- ప్రజాధనం వృథా చేసిన వారిపై చర్యలు
- డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ టి.వి. చలపతిరావు
- ఆసుపత్రి సమస్యలపై కూడా సమీక్ష.. రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు




విశ్వం వాయిస్ పత్రికలో జూన్ 23 న వెలువడిన కథనం..





**రాయవరం, సెప్టెంబర్ 23, విశ్వంవాయిస్ న్యూస్ :** తుల్యభాగ నది ఒడ్డున చెత్తలో నవంబర్ 2026 వరకు గడువు ఉన్న కాల్షియం కార్బోనేట్-విటమిన్ డీ3 మందులు పడేయడంపై విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో జూన్ 23 వ తేదీన వెలువడిన "సర్కార్ ముందు చెత్తలో పాతర" కథనంపై వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి, బ్యాచ్-4310కు చెందిన మందులు ఎక్కడి నుంచి సరఫరా అయ్యాయి, ఎలా తుల్యభాగ ప్రాంతానికి చేరాయి అనే విషయాలను పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. ఈ మేరకు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.వి. చలపతిరావు బుధవారం మండల కేంద్రమైన రాయవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘటనకు సంబంధించిన అంశాలపై విచారణ జరిపారు. 2025 జూన్‌లో తయారైన బ్యాచ్-4310 కాల్షియం కార్బోనేట్-విటమిన్ డీ3 మందుల సరఫరా, పంపిణీకి సంబంధించిన వివరాలను పరిశీలించి, ప్రజాధనం వృథా అయ్యేలా వ్యవహరించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

**పీజీఆర్ఎస్ ఫిర్యాదులపైనా ఆరా**

మందుల ఘటనపై గతంలో పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదులు అందినప్పటికీ, వాటిపై తగిన చర్యలు తీసుకోకుండా పలుమార్లు ఫిర్యాదులను పరిష్కరించకుండానే క్లోజ్ చేసినట్లు వచ్చిన అంశంపైనా విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. అనంతరం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందితో సమీక్షించారు. కుక్కకాటుకు గురై యాంటీ రేబిస్ వ్యాక్సిన్ కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు సూదులు తమ వెంట తెచ్చుకోవాల్సి వస్తోందన్న అంశంపై వివరణ కోరగా అధికారులు వివరణ ఇస్తూ ఇకపై ఇటువంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడతామని డాక్టర్ చలపతిరావు తెలిపారు. గడువు ముగిసిన మందుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా, వాటిని సురక్షితంగా వేరు చేసి భద్రపరచి, బయోమెడికల్ వేస్ట్ నిర్వహణకు అప్పగించే వరకూ భాధ్యత వహించాలని సిబ్బందికి సూచించారు.

**ఆధార్ ఉంటేనే ప్రాథమిక వైద్యం.. వివరణ**

వైద్యం కోసం వచ్చే రోగుల ఆధార్ వివరాలు ప్రభుత్వ ఆదేశాల మేరకు తప్పనిసరైందని, మరోవైపు సంచార జీవులు, వృద్ధులు ఆధార్ కార్డు లేకుండా ఆసుపత్రికి వచ్చిన సందర్భాల్లో ముందుగా వారికి ప్రాథమిక వైద్యం అందించి, అనంతరం అవసరమైన వివరాలను సేకరించేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి చెప్పినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌సీఓలు నాగు, సుబ్రహ్మణ్యం, డాక్టర్ అనిరుద్, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఆయుర్వేద దినోత్సవంపై అవగాహన

**జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా 160 మందికి అవగాహన**

**ఉచితంగా మందులు పంపిణీ : డాక్టర్ సిహెచ్ రమేష్**



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని "ఆరోగ్యం కోసం.. రేపటి కోసం ఆయుర్వేదం" అనే సందేశంతో బుధవారం రాజమహేంద్రవరంలోని కేంద్ర గిడ్డంగుల సంస్థ ప్రాంగణంలో ఆయుర్వేద వైద్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్య అధికారి డా రమేష్ ఆయుర్వేద వైద్య విధానం ద్వారా ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణ, ఆరోగ్యకరమైన జీవనశైలిపై కార్యక్రమానికి హాజరైన వారికి అవగాహన కల్పించారు. ఆయుర్వేద వైద్యుడు, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె. చి. రమేష్ మాట్లాడుతూ ఆయుర్వేదం మన ప్రాచీన వైద్య సంప్రదాయంలో భాగమని, ఆరోగ్య పరిరక్షణలో ఆహార నియమాలు, జీవనశైలి, ప్రకృతి ఆధారిత వైద్య విధానాలకు ప్రాధాన్యత ఉందని తెలిపారు. రోజువారీ జీవితంలో ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఆయుర్వేద వైద్య విధానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర గిడ్డంగుల సంస్థ కార్యాలయ సిబ్బంది, హమాలీలు, వారి కుటుంబ సభ్యులు, రవాణా-సరఫరా కార్యకలాపాల్లో పనిచేస్తున్న కార్మికులు, హోంగార్డులు తదితరులు కలిపి సుమారు 200 మంది ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి ఆయుర్వేద వైద్య విధానం, ఆరోగ్య పరిరక్షణ, వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా 160 మంది కి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ సిహెచ్. రమేష్, కంపౌండర్ పి. సోమసుందర్ రావు, ఎం.ఎన్.ఓ ఎన్. ప్రసాద్, కేంద్ర గిడ్డంగుల సంస్థ రాజమహేంద్రవరం మేనేజర్ ఎస్. జగదీష్, అసిస్టెంట్ మేనేజర్ కె. రామశంకర్, దలయ్య, భవానితో పాటు కార్యాలయ సిబ్బంది, హమాలీలు, వారి కుటుంబ సభ్యులు, రిలయన్స్, ఫ్లిప్‌కార్ట్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు కృత్రిమ మేధ, మేఘ గణనలో శిక్షణ

**వెయ్యి మందికి శిక్షణ.. అనంతరం ఉద్యోగ అవకాశాలు**

**వికాస సంస్థతో కలిసి ఎత్నస్ సంస్థ కార్యక్రమం**



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలోని నిరుద్యోగ యువతకు కృత్రిమ మేధ, మేఘ గణన విభాగాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలకు సన్నద్ధం చేయనున్నట్లు ఎత్నస్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. వికాస సంస్థతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం రాజమహేంద్రవరంలోని కలెక్టర్ శిబిర కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిని సంస్థ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శిక్షణ కార్యక్రమం వివరాలను ఆమెకు వివరించారు. డిగ్రీ, ఇంజినీరింగ్ విద్య పూర్తిచేసిన వారితో పాటు ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఉద్యోగ విపణిలో అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను యువతకు అందించడంతో పాటు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల ద్వారా సుమారు వెయ్యి మంది విద్యార్థులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. కృత్రిమ మేధ, మేఘ గణన వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఉద్యోగాలకు అవసరమైన ఇతర నైపుణ్యాలపైనా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. చదువుతోపాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను విద్యార్థులు సాధించేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం అర్హత కలిగిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అవసరమైన సహకారం అందించనున్నట్లు తెలిపారు. తద్వారా జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎత్నస్ సంస్థ బెంగళూరు సీనియర్ కార్యక్రమ నిర్వాహకుడు సైరిల్ ఫిలిప్, సీనియర్ సంస్థాగత సంబంధాల నిర్వాహకుడు ఐ.జి. రత్నకుమార్, వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు, సిబ్బంది పాల్గొన్నారు.



### గణేష్ వేడుకల్లో

## పాల్గొన్న జక్కంపూడి

**సీతానగరం, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మె ల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు. వినాయ కుడిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిం చారు. అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులతో మాట్లాడి వేడుకల ఏర్పాట్లను అడిగి తెలు సుకున్నారు.

### సీతానగరం పిహెచ్‌సిని

## సందర్శించిన డాక్టర్ ఎన్.వసుంధర




**సీతానగరం, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి మరియు డి ఎల్ ఏ టి ఓ డా. వసుందర సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించడం జరిగింది. సీతానగరం మండలంలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ వసుంధర మాట్లాడుతూ పాముకాటు,కుక్కకాటు మందులతో పాటుగా అత్యవసర మందులన్నీ అందుబాటులో ఉంచుకోవాలని 25వ తారీకున జరిగే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సీతానగరం మండలంలో అంగన్వాడీ సెంటర్లు, పాఠశాలలు, కాలేజీలలో ఉన్న సంవత్సరం నుండి 19 సంవత్సరాల మధ్యలో ఉన్న మొత్తం 12,889 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరుగుతుందని పిల్లలు ఈ మాత్రలు తీసికోవడం ద్వారా నులిపురుగులు కొంకి పురుగులు,బద్ద పురుగులు నివారించబడతాయని తద్వారా పిల్లలలో రక్తహీనత లేకుండా కాపాడవచ్చని,కావున పిల్లలందరూ ఈ మాత్రలు తప్పకుండా తీసు కోవాలని తెలియజేశారు. ప్రస్తుతం జరుగుతున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ ప్రోగ్రాం కూడా సమీ క్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డా.వి. భవాని, డా.ఎం శైలజ రాణి,ఎం పిహెచ్ఈఓ వై.ఎస్.రాయుడు, ఆదిలక్ష్మి,సూపర్వైజర్లు కె.సుధాకర్, ఎన్.అనురాధ, స్టాఫ్ నర్స్ నాగమణి,ఫార్మసిస్ట్ నగేష్, ఎల్ టి కె.శిల్ప,ఓ.పి సిబ్బంది పాల్గొన్నారు.








### దేవాదాయ శాఖ పరిధిలోనే

# ద్రాక్షారామం శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం

**ఆలయ అభివృద్ధి కోసం 2022 సంవత్సరంలోనే దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకొచ్చాం**
**మీడియా సమావేశంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ వెల్లడి**



**ద్రాక్షారామం, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామం శ్రీ భీమేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయం దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోనే ఉందని, 2022 సంవత్సరంలో పబ్లికేషన్ చేయడం ద్వారా దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చిందని, ఈ విషయంలో భక్తులు, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం ద్రాక్షారామం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ఆయన ఆలయ ఈవో దుర్గాభవాని, ఇన్స్పెక్టర్ బాలాజీ సమక్షంలో మీడియాతో మాట్లాడారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టంలోని 6(సి)(2) ప్రకారం 2022లోనే పబ్లికేషన్ ఇవ్వడం జరిగిందని, అప్పటి నుంచే శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయం దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రానున్న పుష్కరాలను కుంభమేళా తరహాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతోందన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని దేవాలయాలను మరింత అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు, సేవలు అందించేందుకు దేవాదాయ శాఖ కృషి చేస్తోందన్నారు. శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకునే భక్తులు శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారిని కూడా దర్శించు కుంటున్నారన్నారు. దేవాలయానికి భక్తులు వస్తున్నప్పుడు, అలాగే హుండీ ఏర్పాటు చేసినప్పుడు ఆలయ మరింత అభివృద్ధి కోసం దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకునే అధికారం దేవాదాయ శాఖకు ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయ సహాయ కమిషనర్ దుర్గాభవానిను డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు సింగిల్ ట్రస్టీగా బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. ఆలయాల అభివృద్ధి, నిర్వహణ కోసం దేవాదాయ ధర్మాదాయ శాఖకు చట్టపరమైన అధికారాలు ఉన్నాయని అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. కొంతమంది భక్తుల్లో ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి ఎందుకు తీసుకున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేసి అపోహలు తొలగించేందుకే మీడియా ద్వారా వివరాలు వెల్లడిస్తున్నామని చెప్పారు. శ్రీ భీమేశ్వర స్వామి ఆలయ సహాయ కమిషనర్ దుర్గాభవాని మాట్లాడుతూ దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకే తాను శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ సింగిల్ ట్రస్టీగా బాధ్యతలు స్వీకరించానని తెలిపారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అన్ని శాఖల సహకారంతో చర్యలు చేపడతామని చెప్పారు. రాబోయే కార్తీకమాసం చివరి మంగళవారం నిర్వహించే దీపారాధన మహోత్సవాన్ని స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ప్రజలు, భక్తుల భాగస్వామ్యంతో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి కూడా మంత్రి వాసంశెట్టి సుభాష్ సహకారంతో కృషి చేస్తామని దుర్గాభవాని తెలిపారు. ఆలయ అభివృద్ధి, నిర్వహణ విషయంలో భక్తులు ఎలాంటి అపోహలు నమ్మవద్దని, అందరి సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

### వృత్తి విద్య విద్యార్థులకు

## రామచంద్రపురం వి.ఎస్.ఎం కళాశాల ఐటీ ల్యాబ్ సందర్శన




**ద్రాక్షారామం, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామ పాఠశాలలో వొకేషనల్ వృత్తి విద్యలో భాగంగా ఐ.టీ/ఐ.టీ.ఈ.యస్ విభాగాన్ని అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు క్షేత్రస్థాయి అవగాహన కల్పించేందుకు రామచంద్రపురంలోని వి.ఎస్.ఎం కళాశాలలోని ఐటీ ల్యాబ్ మరియు కంప్యూటర్ వృత్తి విద్యా విభాగాలను సందర్శించి పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, విద్యార్థులకు పాఠ్యపుస్తక పరిజ్ఞానంతో పాటు పరిశ్రమలు, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలకు అవసరమైన ప్రాయోగిక నైపుణ్యాలను అందించాలనే లక్ష్యంతో ఈ క్షేత్ర సందర్శనను నిర్వహించారు. సంబంధిత జి.సి.డి.ఓలు మరియు వి.సిల మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కంప్యూటర్ ల్యాబ్ నిర్వహణ, కంప్యూటర్ హార్డ్‌వేర్ మరియు సాఫ్ట్‌వేర్ ప్రాథమిక అంశాలు, ఆపరేటింగ్ సిస్టమ్స్, కంప్యూటర్ నెట్‌వర్కింగ్, ఇంటర్నెట్ వినియోగం, డిజిటల్ కమ్యూనికేషన్, డేటా నిర్వహణ, సైబర్ భద్రత, ప్రాథమిక ట్రబుల్‌షూటింగ్ తదితర అంశాలపై ప్రత్యక్ష అవగాహన పొందారు. అలాగే ఐ.టీ/ఐ.టీ.ఈ.యస్ రంగంలో అందుబాటులో ఉన్న వివిధ విద్యా, శిక్షణ మరియు ఉపాధి అవకాశాల గురించి వివరించారు. కంప్యూటర్ రంగంలో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా డిజిటల్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్ వర్క్, సమస్య పరిష్కార నైపుణ్యం, డేటా ఎంట్రీ మరియు డిజిటల్ సేవల నిర్వహణ వంటి నైపుణ్యాల ప్రాధాన్యతను విద్యార్థులు తెలుసుకున్నారు. విద్యార్థులు ఐటీ ల్యాబ్‌లో కంప్యూటర్ల వినియోగ విధానం, వివిధ పరికరాల పనితీరు, నెట్‌వర్క్ కనెక్షన్ల విధానం, సాఫ్ట్‌వేర్ ఆధారిత పనితీరు తదితర అంశాలను పరిశీలించి, తమకు కలిగిన సందేహాలను నిపుణులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా వృత్తి విద్య పట్ల విద్యార్థుల్లో మరింత ఆసక్తి పెరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. శేఖర్, వొకేషనల్ ట్రైనర్ ఆర్.కె. రాజశేఖర్, పాఠశాల పి.డి. పి.ఉమా, పి.ప్రసాద్ తదితరులు పాల్గొని విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించారు. విద్యార్థులు ఇలాంటి క్షేత్ర సందర్శనల ద్వారా తమకు ఇష్టమైన వృత్తి రంగాన్ని ముందుగానే గుర్తించడంతో పాటు, భవిష్యత్తులో ఉన్నత విద్య మరియు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు అవసరమైన ప్రాయోగిక జ్ఞానాన్ని పొందగలరని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. వృత్తి విద్య నైపుణ్యాభివృద్ధికి బాట, నైపుణ్యాలు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది అనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలను మరింతగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### అంతరాష్ట్ర కరాటే పోటీల్లో

## నాథ్ పాఠశాలకు తృతీయ స్థానం



**అమలాపురం, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** యానాంలో గత ఆదివారం నిర్వహించిన మొదటి అంతరాష్ట్ర ఓపెన్ కరాటే, టైక్వాస్ట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అమలాపురంలోని నాథ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ విభాగాల్లో పాల్గొన్న విద్యార్థులు నాలుగు బంగారు పతకాలు, ఐదు రజత పతకాలు, ఎనిమిది కాంస్య పతకాలు సాధించారు. మొత్తం 17 పతకాలు సాధించి అంతరాష్ట్ర పోటీల్లో నాథ్ పాఠశాలకు తృతీయ స్థానం దక్కేలా చేశారు. ఈ సందర్భంగా పాఠశాల తరఫున ట్రోఫీని కైవసం చేసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ విశ్వనాథ్ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థి పతకం సాధించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు సమర్థవంతమైన శిక్షణ అందించి ఈ విజయానికి కృషి చేసిన కరాటే కోచ్ దేశంశెట్టి సాయిబాబును ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.నాగేశ్వర రావు మాట్లాడుతూ విద్యార్థులు తమ వ్యక్తిగత ప్రతిభను చాటుకోవడంతో పాటు పాఠశాలకు కూడా మంచి గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు. పాఠశాల ఇన్‌చార్జి పి.రత్నకుమారి విద్యార్థులను అభినందించారు. ఈ విజయానికి కృషి చేసిన కరాటే కోచ్ దేశంశెట్టి సాయిబాబు, ప్రిన్సిపాల్ విశ్వనాథ్, ప్రధానోపాధ్యాయుడు ఎ.నాగేశ్వరరావు, పాఠశాల ఇన్‌చార్జి పి.రత్నకుమారి, డి.కృష్ణరావు, ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

## ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్తు పాలకవర్గానికి ఆత్మీయ వీడ్కోలు

**కాకినాడ, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సమావేశానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్,ఎమ్మెల్సీ కుడిపూడి సూర్య నారాయణ,వైస్ చైర్మన్లు బుర్రా అనుబాబు,మేరుగు పద్మలత,రొంగల పద్మలత,ఆయా మండలాల జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్, జెడ్ పి సి ఈ ఓ, జెడ్ పి టి సి ల చే ఘనంగా జిల్లా ప్రజా పరిషత్తు చైర్మన్ విప్పర్తి వేణు గోపాలరావు ను సన్మానించి సత్కరించారు.

**ప్రజా సేవే పరమావధిగా అభివృద్ధికి పునరంకితం కావాలి.**



జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో ప్రజాసేవే అత్యున్నత మైనదని, 'మానవ సేవే మాధవ సేవ' అనే భావనతో ప్రజా ప్రతి నిధులు నిరంతరం ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు.ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సాధారణ ఆత్మీయ సమావేశం లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ చైర్మన్, సీఈవో, డిప్యూటీ సీఈవో, డిప్యూటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, జెడ్పీటీసీ సభ్యులు జిల్లా పరిషత్ సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేశారు. గత ఐదేళ్ల కాలంలో అనేక సమస్యలు ఎదురైనప్పటికీ, ప్రజాప్రతి నిధులందరూ తమ వంతు బాధ్యతగా తీవ్రంగా కృషి చేసి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించారని, చాలామంది లబ్ధిదారులు దీని ద్వారా ప్రయోజనం పొందారని ప్రశంసించారు. ప్రజాసేవ ను భవిష్యత్తు లోనూ ఇలాగే కొనసాగించా లని జెడ్పీటీసీలు గానే కాకుండా ప్రజా ప్రతినిధులుగా తదుపరి స్థాయి లైన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలుగా ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై స్పందిస్తూ, కరోనా మహమ్మారి వల్ల రెండు విలువైన సంవత్సరాలను కోల్పోవాల్సి వచ్చిందని, దాని ప్రభావం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్రంగా పడిందని తెలిపారు . రాష్ట్ర విభజన అనంతరం ఆర్థికంగా వెనుకబడ్డామని, గత 10 ఏళ్లుగా ఈ పరిస్థితి కొనసాగుతోందని వివరించారు. రాష్ట్రం సొంత కాళ్లపై నిలబడటానికి మరో 5 నుండి 10 సంవత్సరాల సమయం పట్టే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, 2014 తర్వాత వచ్చిన ప్రభుత్వాల నిరంతర కృషితో ముందుకు సాగుతున్నామని, రాబోయే 5 నుండి 10 ఏళ్లలో ఆశించిన స్థాయి ఆదాయాన్ని సమకూర్చుకోగలుగుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదాయం పెరిగిన కొద్దీ ప్రజలకు కావలసిన అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల మంజూరుకు అవసరమైన పూర్తి స్థాయి నిధులు కేటాయించే వీలు కలుగుతుందని, సమయం పట్టినప్పటికీ ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. రాజకీయ పార్టీలకు అతీతంగా,ఎటువంటి భేదాభిప్రాయాలు లేకుండా సభ్యులందరూ కలిసికట్టు గా సమస్యలను ప్రతిపాదించి చర్చించడం అభినంద నీయమని కలెక్టర్ కొనియాడారు జెడ్పీ సమావేశాల్లో సభ్యులు ఎంతో ఐక్యతతో, సానుకూల వాతావరణం లో కార్యాచరణ సాగించడాన్ని ప్రత్యక్షంగా గమనించానని చెప్పారు.భవిష్యత్తులో కూడా ఇదే ప్రజాసేవా దృక్పథంతో అధికారుల తో పూర్తి స్థాయిలో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత మేలు జరిగేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా జెడ్ పి టి సి సభ్యులు వారి అభిప్రాయాలను తెలియ జేశారు.ఈసమావేశం లో భాగంగా జడ్పీ వైస్ చైర్మన్ లకు,జెడ్ పి టి సి సభ్యులకు సన్మాన కార్య క్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ సత్య నారాయణ,జెడ్పీ సీఈవో లక్ష్మణ రావు,డిప్యూటీ సి ఈ ఓ డి.శ్రీలలిత, జెడ్ పి టి సి సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### జనగణన-2027 ఫేజ్-1

## హౌస్ లిస్టింగ్ ప్రక్రియ 100 శాతం పూర్తి



**అమలాపురం, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జనగణన-2027 ఫేజ్-1 హౌస్ లిస్టింగ్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వి.సుబ్బారావు తెలిపారు. బుధవారం అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి ఆంధ్రప్రదేశ్ జనగణన డైరెక్టర్ జె. నివాస్ ఐఏఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో జనగణన-2027 నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి జిల్లా రెవెన్యూ అధికారి వి. సుబ్బారావు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ.. జిల్లాలో 2011 జనగణన డేటాతో డిస్ట్రిక్ట్ హ్యాండ్‌బుక్ డేటాను పోల్చి గుర్తించిన వ్యత్యాసాలను సెప్టెంబర్ 19న సబ్‌డిస్ట్రిక్ట్ పీసీఓలకు పంపించినట్లు తెలిపారు. అనంతరం జిల్లాలోని ఛార్జ్ అధికారులు ప్రతిరోజూ 3 నుంచి 4 మంది విలేజ్ ఆఫీసర్లను సంప్రదిస్తూ క్షేత్రస్థాయి నాణ్యతా తనిఖీలు చేపట్టాలని సూచించారు. డేటా సవరణ ప్రక్రియలో అవసరమైన సహకారం కోసం టెక్నికల్ అసిస్టెంట్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. గుర్తించిన వ్యత్యాసాలను పరిశీలించి అక్టోబర్ 2, 2026లోగా సవరణలు పూర్తి చేయాలని, అనంతరం సవరించిన డేటాను పరిశీలించి ఛార్జ్ అధికారులు అక్టోబర్ 5, 2026లోగా తుది ఆమోదం తెలపాలని సూచించారు. జనగణన-2027 ప్రక్రియలో డేటా నాణ్యత, ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సెన్సస్ జిల్లా ఇన్‌చార్జి, డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్, జనగణన అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్ఐసి ఏజెంట్ల సర్వసభ్య సమావేశం



**నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక**

**రావులపాలెం, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం ఎల్ఐసి బ్రాంచ్ ఏజెంట్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక పార స్వచ్ఛంద సేవా సంస్థ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాజమండ్రి డివిజనల్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు రావుల మాధవరావు, ప్రధాన కార్యదర్శి మాలే నాగబాబు, కోశాధికారి పి.రెడ్డమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, సంస్థ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఏజెంట్ల సంక్షేమం, వ్యాపార విస్తరణ, సేవల మెరుగుదలపై పలు సూచనలు చేశారు. అనంతరం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పులిదిండి శ్రీనివాసరావు, కోశాధికారిగా ఎలమర్తి సీతారాములు ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో పదవీ ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఈసీ మెంబర్ కంచర్ల సాంబమూర్తి, డివిజన్ ఉపాధ్యక్షుడు తులా రామారావు, డివిజన్ ఈ.సి. మెంబర్ మట్టపర్తి శ్రీనివాసరావు పెద్ద సంఖ్యలో ఎల్ఐసి ఏజెంట్లు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా గణేష్ నిమజ్జనం



**రావులపాలెం, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** గణపతి నవరాత్రులలో భాగంగా తొమ్మిది రోజులపాటు విశేష పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జన మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. రావులపాలెం సీఆర్సీ రోడ్డు మొదటి వీధిలో నందం వీర వెంకట సత్యనారాయణ నివాసం వద్ద ప్రతిష్ఠించిన గణపతి విగ్రహాన్ని మంగళవారం ప్రత్యేక పూజలు, హారతుల అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి సమీప కాలువలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయకుడికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భజనలు, మంగళ వాయిద్యాల నడుమ సాగిన నిమజ్జన కార్యక్రమంలో యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.ఈ కార్యక్రమం లో నందం రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 50వ జాబ్ మేళాలో 25 మందికి ఉద్యోగాలు

**నియామక పత్రాలు అందజేసిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్**



**రామచంద్రపురం, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామచంద్రపురం నియోజకవర్గంలో నిరుద్యోగ నిర్మూలన లక్ష్యంగా ప్రతి వారం నిర్వహిస్తున్న జాబ్ మేళాలు యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తూ విజయవంతంగా కొనసాగుతున్నాయి. రామచంద్రపురం ఉపాధి భవన్‌లో నిర్వహించిన 50 వ జాబ్ మేళాలో మొత్తం 24 మంది అభ్యర్థులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఫ్లిప్కార్ట్ 9, టాటా విస్ట్రాన్ 3. నెట్ ఆన్ కంపెనీకి 6 మంది, టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీకి 7 ఎంపికయ్యారు. కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధి శాస్త్రి, కిరణ్ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించబడింది. ఎంపికైన అభ్యర్థులకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం చేతులమీదుగా నియామక పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ మంత్రి సుభాష్ ఆదేశాల మేరకు క్రమం తప్పకుండా రాష్ట్రంలోని పలు కంపెనీలను ఆహ్వానించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఆయా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు తమకు ఈ అవకాశం కల్పించిన మంత్రి వాసంశెట్టి సుభాష్, వాసంశెట్టి సత్యం, ఉపాధి అధినేత రామ్ కుమార్లకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఐక్యతతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా

## ప్రజలకు సేవలు అందించాం : విప్పర్తి

**కాకినాడ, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్తు చైర్మన్ విప్పర్తి వేణుగోపాల రావు మాట్లాడుతూ 2022 సంవత్సరం లో జెడ్పిటిసి సభ్యులుగా ఎన్నికై, గత ఐదేళ్లుగా అందరూ ఒకే మాటపై నిలబడి ఉత్తమ సేవలు అందించామని ఆయన తెలిపారు. ఈ ఐదేళ్ల పాలనపై ఆయన ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ ఎలాంటి గొడవలకు తావులేకుండా ఐకమత్యంతో పరిపాలన సాగించామని ఆయన తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు అందరు రాబోయే రోజుల్లోనుప్రజాసేవ లో కొనసాగాలని సూచించారు. రాష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో అందరూ ప్రజాసేవలో మళ్లీ నిమగ్నం కావాలని పిలుపు నిచ్చారు. ఈ ఐదేళ్ల పాలన కాలంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కారుణ్య నియామకాల కింద 177 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు ఆయన వివరించారు. సీఈఓ, డిప్యూటీ సీఈఓ ఇతర జెడ్పీ సిబ్బంది సహకారంతో ఆయా కుటుంబాలకు జిల్లా పరిషత్ తరఫున అండగా నిలిచామని వెల్లడించారు. అలాగే బదిలీల ప్రక్రియను కూడా పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు స్పష్టం చేశారు.

**నాలుగు జిల్లాలుగా ఉమ్మడి గోదావరి విభజన**

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నాలుగు జిల్లాలుగా విభజించబడుతోందని, ఈ నెల 25, గురువారం ఉదయం నుంచి ఈ నాలుగు జిల్లా పరిషత్తులు పూర్తిస్థాయిలో పరిపాలనలోకి వస్తాయని చైర్మన్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన జీవోలు ఇప్పటికే వస్తున్నాయని, సంబంధిత సీఈఓలు, డిప్యూటీ సీఈఓలు, సిబ్బంది ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారని ఆయన తెలిపారు. చారిత్రాత్మకమైన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్‌కు తాను ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కష్టపడి పని చేసి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షిస్తూ, సమావేశంలో పాల్గొన్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు.



# ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ పాలక వర్గం ప్రగతి నివేదిక

## అభివృద్ధికి అంకితమైన ఐదేళ్ల సేవా ప్రస్థానం : చైర్మన్ విప్పర్తి వేణుగోపాల రావు

**కాకినాడ, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్‌గా విప్పర్తి వేణు గోపాలరావు విశిష్ట సేవల అవిభాజ్య ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 62 మండలాలకు ప్రాతినిధ్యం వహించిన జిల్లా ప్రజా పరిషత్‌కు 2019- 2020 సంవత్సరాల్లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో పి.గన్నవరం నియోజకవర్గం నుంచి జెడ్.పి.టి.సి.గా ఎన్నికైన విప్పర్తి వేణుగోపాలరావు , అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై ఐదేళ్లపాటు విశిష్ట సేవలు అందించారు. అప్పటి రాజకీయ పరిస్థితుల్లో జిల్లా పరిషత్ లోని 62 స్థానాల్లో 61 స్థానాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుచుకున్న నేపథ్యంలో, జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్‌గా విప్పర్తి వేణుగోపాలరావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ప్రభుత్వం మారి నప్పటికీ, రాజకీయాలకు అతీతంగా జిల్లా అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని తన పదవీ బాధ్యతలను కొనసాగించారు.గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలంలో సుమారు రెండున్నర సంవత్సరాలు, అనంతరం ప్రస్తుత కూటమి ప్రభుత్వ కాలంలో మరో రెండున్నర సంవత్సరాలు కలిపి మొత్తం ఐదేళ్లపాటు నిరంతరాయంగా జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్‌గా సేవలందించడం విశేషం.ఈ ఐదేళ్లలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పాలనలో భాగంగా కరోనా వంటి విపత్కర పరిస్థితులను అధికమించి, కోవిడ్-19 నిబంధనలు పాటించుచూ ,పంచాయితీరాజ్ చట్టంలోని నిబంధన లకు లోబడి నిర్ణీత కాల వ్యవధిలో జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశములు, స్థాయీ సంఘ సమావేశములు సక్రమంగా నిర్వహించి ఈ 5సంవత్సరముల పాలనా కాలంలో సుమారుగా 1560 తీర్మానములను ఏకగ్రీవంగా ఆమోదింపచేసి, పాలనలో తనదైన ముద్రను కనుపరస్తూ అందు జిల్లా ప్రజా పరిషత్ సాధారణ నిధులతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, అనేక మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు.ఈ 5 సంవత్సరముల కాలములో సుమారు రూ.65 కోట్లతో రూ.1,550 అభివృద్ధి పనులను మంజూరు చేసి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని నాలుగు జిల్లాలకు సమానా నిష్పత్తిలో నిధులు కేటాయించి, వివిధ అభివృద్ధి పథకాలను పరుగులెత్తించారు. అందులో భాగంగా ఈక్రింది పొందు పరచిన పనులకు ప్రత్యేక ప్రాదాన్యత కల్పించారు.

**పనుల వివరములు :**

ఉమ్మడి గోదావరి జిల్లాలలో గ్రామీణ పంచాయతీ రహదారుల నిర్మాణం, అభివృద్ధి సీ సీ డ్రెయిన్లు, డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణం



కమ్యూనిటీ భవనాల నిర్మాణం పాఠశాల భవనాల అభివృద్ధి అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, అభివృద్ధి

వ్యవసాయ సంబంధిత గోడౌన్ల నిర్మాణం పంట కాలువలపై కల్వర్టుల నిర్మాణం కాలువలకు రిటైనింగ్ వాల్స్ నిర్మాణం పాఠశాలల్లో ఆటస్థలాల అభివృద్ధిగ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యాల కల్పన వంటి కార్యక్రమాలతో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని ఆయన వెల్లడించారు.

అలాగే ఎస్సీ, ఎస్టీ కాలనీల లో రహదారుల అభివృద్ధి కాలువల పూడికతీత, పారిశుద్ధ్య పనులు వంటి అనేక ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.మంచినీటి సౌకర్యానికి ప్రత్యేక ప్రాధాన్యత

కేంద్ర ప్రభుత్వం అందించిన 14 వ, 15 వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యము నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. సుమారు 64 పంపింగ్ సిపిడబ్ల్యూఎస్ పథకాలకు సంబంధించిన మంచినీటి నిర్వహణ పనులకు ఐదేళ్ల కాలంలో సుమారు రూ.300 కోట్ల నిధులను వినియోగించి, గ్రామీణ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు . అదే విధముగా ప్రజల ప్రాథమిక అవసరాల్లో అత్యంత ముఖ్యమైన మంచినీటి సరఫరా వ్యవస్థ నిరంత రాయంగా కొనసాగేందుకు జిల్లా ప్రజా పరిషత్ స్థాయిలో సమన్వయం తో పనిచేయడం ఆయన పదవీకాలంలో ఒక ముఖ్యమైన అంశంగా నిలిచింది.ఎస్సీ, ఎస్టీ కాలనీ ల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ. రూర్బన్ పీఎంజీఎస్‌వై వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ కాలనీలలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ వివిధ గ్రామాల్లోరహదారులు, డ్రైనేజీ, ఇతర ప్రజోపయోగ సదుపాయాల కల్పనకు సహకరించడం జరిగింది.అదేవిధంగా ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ విబిజీ రాంజీ పథకం కింద వివిధ మండలాల్లోఆమోదించబడిన పనులకు జిల్లా పరిషత్ స్థాయిలో తీర్మానాల ద్వారా ఆమోదం తెలుపుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి మౌలిక వసతుల అభివృద్ధికి పరోక్షంగా విశేష సహకారం అందించారు. పంచాయతీ రాజ్ సంస్థలకు మౌలిక వసతుల బలోపేతం మండల ప్రజా పరిషత్‌లు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ వ్యవస్థ పరిధిలోని వివిధ సంస్థలు, కార్యాలయాలు, గెస్ట్‌హౌస్ లకు అవసరమైన నిధులు సమకూర్చి వాటిని వినియోగయోగ్యంగాప్రజలకు అధికారు లకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయడంలో కూడా చైర్‌పర్సన్‌గా ప్రత్యేక చొరవ చూపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సేవఈ ఐదేళ్ల సుదీర్ఘ పదవీ కాలంలో రాజకీయ మార్పులు చోటు చేసు కున్నప్పటికీ, జిల్లా ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యక్రమాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం విప్పర్తి వేణుగోపాల రావు ప్రత్యేకతగా నిలిచింది.నిష్పక్షపాత వైఖరి, నిస్వార్థ సేవా దృక్పథం, పారదర్శక పరిపాలన, ప్రజా సమస్యల పట్ల స్పందనవంటి లక్షణాలతో జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్‌గా తనదైన ముద్ర వేశారు. అదే విధముగా ఆపదలో ఉన్న నిరుపేదలకు అవసరమగు వైద్య సదుపాయములు కల్పించుటకు సంబందిత వైద్యశాఖ అధికారులతో మాట్లాడి వెంటనే వైద్యము అందేటట్లు విశేష కృషి చేసారు. అదే విధముగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నాలుగు జిల్లాలుగా పునర్విభజనకు గురైనప్పటికీ, అప్పటి ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని ప్రాంతాలను సమాన దృష్టితో చూసి అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడం ద్వారా తన పదవికి వన్నె తెచ్చారు.

**ఐదేళ్ల సేవకు ఘనమైన ముగింపు**

2019 / 2020 స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం ప్రారంభమైన ఆయన పదవీకాలం,ఈ నెల 24 వ తేది వరకు సుమారు ఐదేళ్లపాటు కొనసాగి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, జిల్లా ప్రజా పరిషత్ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది. ఈ సుదీర్ఘ కాలంలో గ్రామీణ ప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీ, మంచినీరు, విద్య వైద్య కమ్యూనిటీ వసతులు, వ్యవసాయ మౌలిక సదుపాయాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధి వంటి అనేక రంగాల్లో వారు చేపట్టిన పనులు ఆయన సేవా ప్రస్థానానికి ప్రతీకలుగా నిలిచాయి.పదవి శాశ్వతం కాదు. ప్రజలకు చేసిన సేవే శాశ్వతం అనే స్ఫూర్తితో ఐదేళ్లపాటు జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించిన విప్పర్తి వేణుగోపాలరావుకి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తరపున హృదయ పూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన భవిష్యత్ ప్రజా జీవితానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము అన్నారు.

### తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు

# రాజకీయ పార్టీలు సహకరించాలి : డీఆర్వో



**కాకినాడ, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి తిప్పే నాయక్ కోరారు.బుధవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో తిప్పేనాయక్ సమావేశం నిర్వహించి, ఎన్నికల కమిషన్ సూచనల మేరకు జిల్లాలో చేపడుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ -సర్ కార్యకలాపాల పై వివరించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ లో నాణ్యతకు ప్రాధాన్యత నిస్తూ, ఏఈఆర్ఓ లు రోజుకు గరిష్టంగా 100 నోటీ సు లను మాత్రమే పరిశీలించాలని సూచించామన్నారు. జిల్లాలోని 07 నియోజక వర్గాల పరిధిలో నేటి వరకు 1822 పోలింగ్ కేంద్రాల్లో 14,55,209 ఓటర్లుగా నమోదు అయ్యారన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా వివిధ కారణాల వల్ల మొత్తం 1,95,602 ఓట్లను తొలగించడం జరిగిందని, వీటిలో 31,695 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, క్లెయిమ్స్, అబ్జెక్షన్లు అక్టోబర్ 05 లోపు పరిష్కరించడం జరుగుతుందన్నారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 9న ప్రచురించడం జరుగుతుందని డిఆర్ఓ వివరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజల్లో అవగాహన చైతన్యాన్ని కల్పించి, క్లెయిమ్స్, అభ్యంతరాల నమోదుకు సహకరించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం-6, ఓటరు జాబితా లో మార్పులు, చేర్పుల కోసం ఫారం-7, పోలింగ్ కేంద్రం మార్పు కోసం ఫారం-8 ద్వారా అందిన దరఖాస్తులు, నోటీసుల ను నిబంధనల మేరకు ఖచ్చితత్వంతో పరిశీలించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఓటర్ల జాబితా సవరణలో నాణ్యతకు ప్రాధాన్యత నిస్తూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, అనర్హులైన వారి పేర్లు జాబితాలో లేకుండా అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్వహిం చేందుకు రాజకీయ పార్టీలు, ఎన్నికల యంత్రాంగం సమన్వ యంతో పనిచేయాలని కోరారు. అర్హత కలిగి, నోటీసులు అందుకున్న ఓటర్లు గుర్తింపు పత్రాలతో పాటు సంబంధిత అధికారుల ముందు హాజరై అర్హతను ధ్రువీకరించు కోవచ్చునని ఆయన తెలిపారు.తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటరు జాబితా రూప కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటరు జాబితా తయారీకి సంబంధించి ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను షెడ్యూల్ ను ఈ సందర్భంగా డీఆర్వో.. రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజక వర్గపు ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో భాగంగా 2026 సెప్టెంబర్ 28వ తేదీన నోటీసు జారీ చేయడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా 2026 నవంబర్ 6 వ తేదీ వరకు ఫారం-19 దరఖాస్తులు స్వీకరించడం జరుగు తుందని తెలిపారు. దీనికి అనుగుణంగా 2026 నవంబర్ 25వ తేదీన ముసాయిదా జాబితా ప్రకటన ఉంటుందని, అదే రోజు నుండి 2026 నవంబర్ 25 వ తేది నుండి డిసెంబర్ 10వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని వెల్లడించారు. తదుపరి దశలో 2026 డిసెంబర్ 25 నాటికి అభ్యంతరాల పరిష్కారం పూర్తి చేసి, 2026 డిసెంబర్ 30వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రచురించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ ఉపాధ్యాయ నియోజకవర్గంలో తమ పేరు నమోదు చేసుకోవడానికి కావలసిన అర్హతలు,నిబంధనలను వివరించారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు, గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులందరూ నిబంధనల ప్రకారం తమ ఓటు దరఖాస్తులను సక్రమంగా సమర్పించేలా రాజకీయ పార్టీల ప్రతి నిధులు తమ సహకారాన్ని అందించాలని డీఆర్వో కోరారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు కె.కృష్ణమోహన్(ఆప్), ఎస్.అప్పారావు(బిఎస్పి), సీహెచ్.రమేష్ (బీజేపీ), పి.వీరబాబు (సీపీఎం) పి. శ్రీనివాసు (ఐ.ఎన్.సీ), జీ.సాయి బాబా (టిడిపి); ఎ.సత్యనారాయణ(జనసేన)ఆర్.వెంకటేశ్వరరావు (వైఎస్ఆర్ సీపీ); ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.జగన్నాథం, డీటీ తేజ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### జల జీవన్ మిషన్, అమరజీవి జలధార ప్రాజెక్టులను

# నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలి

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**



**కాకినాడ, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా లో జల జీవన్ మిషన్, అమరజీవి జలధార ప్రాజెక్టుల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతం చేసి, ప్రతి ఆవాసంలో ప్రతి వ్యక్తికి రోజుకు 55 లీటర్ల సురక్షిత నీరు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పంచాయ తీరాజ్, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) ఇంజనీర్లను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆర్‌డబ్ల్యూ ఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అధికారుల కన్వర్జెన్సీ సమీక్షా సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జల జీవన్ మిషన్, అమరజీవి జలధార, స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాల పురోగతిని మండలాల వారీగా సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్రాగు నీటి సరఫరా మెరుగుదలలో భాగంగా సింగిల్ విలేజ్ స్కీములు, రెట్రోఫిట్టింగ్ పనులు, ఓహెచ్ఎస్ఆర్‌ల ప్రక్షాళన, శుభ్రత పనులను వేగవంతం చేయాలని సూచించారు. గృహ పంచాయతీ నంబర్లు,ఆస్తి పన్ను రసీదుల ఆధారంగా కుళాయి కనెక్షన్లు లేని నివాసాలను గుర్తించి, ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.వేసవి ముందస్తు చర్యల్లో భాగంగా రాబోయే వేస విలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సమ్మర్ స్టోరేజ్ చెరువులను కాలువల ద్వారా గ్రావిటీ లేదా పంపుల సహా యంతో ముందుగానే నింపేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సదుపాయాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంతో పాటు,నిరుపేద గిరిజన ఆవాసాల్లో సురక్షిత తాగునీటి సరఫరాపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కింద అవసరమైన ప్రాంతాల్లో శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలను వేగవంతం చేసి ప్రజలకు అందు బాటులోకి తీసుకురావాలని తెలిపారు. నిరంతర పారిశుద్ధ్య చర్యలు, ప్రజల్లో అవగాహన ద్వారా గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహితంగా తీర్చిదిద్దాలని, స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలను శాఖల సమన్వయంతో సాధించాలని సూచించారు.ఆర్‌డబ్ల్యూఎస్ జల వనరుల శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షిం చాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పురోగతిలో ఉన్న,పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి వాటి పూర్తికి నిర్దిష్ట గడువులు విధించి, నిర్దేశిత కాలపరిమితిలో లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. పనుల అమలులో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు.ఈసమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండింగ్ ఇంజనీర్ మహమ్మద్ అబ్దుల్ మతీన్, జిల్లా పంచాయతీ అధికారి పి. రవికుమార్, డ్వామా పథక సంచాలకులు ఎస్. మధుసూదన్, జలవ నరుల శాఖ కార్యనిర్వా హక ఇంజనీర్ శేషగి రిరావు, వివిధ శాఖల ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీ బొడ్డు విష్ణుమూర్తి అనారోగ్యంతో మృతి



**కాజులూరు, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మాజీ ఎంపీపీ బొడ్డు విష్ణుమూర్తి (86) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని ఆర్యవటంకు చెందిన విష్ణుమూర్తి 2001లో ఉప్పుమిల్లి గ్రామం నుండి ఎంపీటీసీగా గెలుపొంది కాజులూరు మండల పరిషత్ అధ్యక్షుడి హోదా దక్కించుకున్నారు. ఈ మేరకు 2006 వరకు విష్ణుమూర్తి మండల పరిషత్ అధ్యక్షునిగా పనిచేశారు. దివంగత లోక్‌స్పీకర్ జీఎంసీ బాలయోగికి, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు కి అత్యంత సన్నిహితునిగా మెలిగారు. విష్ణుమూర్తి భార్య గత నాలుగు సంవత్సరాల క్రితం మృతిచెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, జడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, సొసైటీ చైర్మన్ కోట తాతబ్బాయి, బీసీ సెల్ నాయకులు కడలి రాంపండు, వెలగా సత్తిరెడ్డి, పార్టీలకతీతంగా మండల గ్రామాలకు చెందిన పలువురు నాయకులు విష్ణుమూర్తి నివాసానికి చేరుకుని నివాళులార్పించారు.

## తుపాన్ వల్ల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు

**తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ హరేంధిర ప్రసాద్**

**కాకినాడ, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** భారీవర్షాలు,తుపాను వాతావరణం నేపథ్యంలో ప్రజారోగ్యం విద్యార్థుల భద్రతపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు.జిల్లా లో కురుస్తున్న భారీ వర్షాలు తుపాను ముప్పు ఆధారంగా జిల్లా కలెక్టర్ గురువారం జిల్లా స్థాయి అధికారులు వివిధ మండలాల ప్రత్యేక అధికారులు తహసీల్దార్లు ఎంపీడీఓలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయి పరిస్థితులు,వర్షపాతం వివరాలు, ప్రధాన రిజర్వాయర్ల నీటిమట్టాలు మరియు సహాయక చర్యల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్ ప్రతి శాఖాధికారి తోనూ వివరంగా చర్చించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 22 వ తేదీ సాయంత్రం నాటికి జిల్లా వ్యాప్తంగా సగటున 84 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా,బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వ్యవధిలోనే అదనంగా మరో 19 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని వివరించారు. ఈ వర్షాలు 24 వ తేదీ వరకు కూడా కొనసాగే అవకాశం ఉందని అందువల్ల అధికారులందరూ మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పాఠశాలల భవనాల పరిస్థితిని, సీలింగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే విద్యార్థులను తరగతి గదుల్లోకి అనుమతించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భవనాలు సురక్షితంగా లేకపోతే ప్రత్యామ్నాయ గదుల్లో తరగతులు నిర్వహించాలని ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేశారు. మండల ప్రత్యేక అధికారులు ఈ అంశాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఏలేరు రిజర్వాయర్ వద్ద ప్రస్తుతం 145 క్యూసెక్స్ ఇన్ఫ్లో వస్తోందని, రాబోయే రోజుల్లో ఇది పెరిగే అవకాశం ఉందన్నారు.

**వివిధ శాఖల సన్నద్ధత..**

వైద్య ఆరోగ్య శాఖ వారు రాబోయే 10 రోజుల్లో ప్రసవ తేదీ ఉన్న 30 మంది గర్భిణులను గుర్తించామని, వారిని సురక్షితంగా పిహెచ్‌సీలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌ఓ కలెక్టర్ కు తెలిపారు. ప్రత్తిపాడు, రౌతులపూడి వంటి కొండ ప్రాంత హేబిటేషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. కాకినాడ జిల్లాలో ఎక్కడా విద్యుత్ స్తంభాలు పడిపోవడం వంటి సంఘటనలు నమోదు కాలేదని, అన్ని సబ్‌స్టేషన్లలో స్పేర్ పోల్స్, కండక్టర్లు,కేబుల్స్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.రోడ్ల పై చెట్లు కూలిపోతే తక్షణమే తొలగించేందుకు జేసీబీలు,ట్రీ కట్టర్లు, ట్రాక్టర్లను సిద్ధం చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

### ప్రకృతి నాశనం వల్ల

## నష్టపోయేది మానవులే

**పోలిపర్తి దాలినాయుడు - హరిత వికాస్ ఫౌండేషన్**





**కోటనందూరు, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** మల్లారెడ్డి యూనివర్సిటీ (మేడ్చల్ )లోని వ్యవసాయ కళాశాల విధార్థులకు అంతర్గత ఉద్యోగ శిక్షణ లో భాగంగా దీర్ఘాయుష్ సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ (హైదరాబాద్ )లోని (జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థఁ పంచాయతీ రాజ్ )శిక్షణా ప్రాంగణంలో బుధవారం రూరల్ టెక్నాలజీ పార్క్ డైరెక్టర్ కతిరేసన్ గారి నేతృత్వంలో పిచ్చుకలు మరియూ పర్యావరణ పరిరక్షణపై తుని పట్టణానికి చెందిన హరిత వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పోలుపర్తి దాలినాయుడు పత్యేక ప్రసంగం చేసిన అనంతరం సృష్టిలోని ప్రతీ జీవికి జీవించే హక్కుందని.. ప్రతీ జీవి వల్ల మరొక జీవికి ప్రత్యుపకార ప్రయోజనం తెలియకుండానే చేకూరుస్తుందని. ప్రస్తుత పరిస్థితుల్లో మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, ప్రకృతి వినాశనం వల్ల తీవ్రంగా నష్టపోయేది మానవులు మాత్రమే..అని దాలినాయుడు అన్నారు. అభివృద్ధి చెందుతున్నామనుకొంటూనే మనకు మనమే కొన్ని నష్టాలను కొని తెచ్చుకొంటున్నామని..అభివృద్ధి ఏ జీవికి హానికరం కాకూడదని.. ముందు తరాలకు తెలియజేయాలనే వ్యవసాయ విద్యార్థులకు ఈ అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని రూరల్ టెక్నాలజీ పార్క్ డైరెక్టర్ కతిరేసన్ అభిప్రాయం వ్యక్తం చేసారు. అనంతరం మేడ్చల్ లోని మల్లారెడ్డి వ్యవసాయ విద్యాలయానికి వెళ్ళి అక్కడ విద్యార్థులకు వరి కుంచెలు తయారీపై అవగాహనా, శిక్షణ అందించారు. ఈ కార్యక్రమాల్లో సినీ నటుడు మహర్షి రమణ, దీర్ఘాయుష్ అంకుర సంస్థ ప్రతినిధి శివరామకృష్ణ, దీర్ఘాయుష్ సంస్థ వాణిజ్య ప్రతినిధి సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు..

## 8వ రోజూ కొనసాగుతున్న వీఆర్ఏల నిరవధిక సమ్మె

**వీఆర్ఏల అర్థనగ్న ప్రదర్శన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**



**కోటనందూరు, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కోటనందూరు మండలంలోని వీఆర్ఏలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వీఆర్ఏలు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. చాలీచాలని జీతాలతో మా కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉందని దీనితో కుటుంబ పోషణ భారమైందని వీఆర్ఏలు వాపోయారు. పిల్లలకు చదువులు చెప్పించడానికి కూడా నెల నెల అప్పు చేయవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామాల్లో విఆర్ఏలతో పని చేయిస్తున్న ప్రభుత్వం మా గురించి కూడా ఆలోచించాలని వీఆర్ఏలు కోరారు. వీఆర్ఏలందరికీ తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు చేయాలని, ప్రస్తుతం నామినీలుగా పనిచేస్తున్న వారందరినీ వన్‌టైం సెటిల్మెంట్ ద్వారా వీఆర్ఏలుగా నియమించాలని వారు డిమాండ్ చేశారు. అర్హత కలిగిన వీఆర్ఏలకు 90 శాతం ప్రమోషన్ అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే విధి నిర్వహణలో ఉండగా మరణించిన వీఆర్ఏల కుటుంబాల్లో వయోపరిమితిని పరిగణనలోకి తీసుకోకుండా కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి సేవలందిస్తున్న వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని వీఆర్ఏలు తెలిపారు.

### కోటనందూరు మండలంలో

## 1639 మంది పింఛన్లుకు ఆన్లైన్ దరఖాస్తులు

**ఎంపీడీవో పి.వెంకటనారాయణ**



**కోటనందూరు, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతలో అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయడానికి ఈనెల 7వ తేదీ నుండి 18వ తేదీ వరకు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో వివిధ రకాల పింఛన్లు సంబంధించి1639 ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో పి వెంకటనారాయణ తెలిపారు. అల్లిపూడి1 92, అల్లిపూడి 2 170, భీమవరపు కోట 84, బిళ్ళనందూరు 74, బొద్దవరం 171, ఇండుగపల్లి 96, జగన్నాథపురం104, కే ఏ మల్లవరం 116, కేఈ చిన్నయ్యపాలెం 73, కే కొట్టం 134, కాకరాపల్లి77, కోటనందూరు 1 66, కోటనందూరు2, 110, పి కొట్టాం 159, ఎస్ ఆర్ పేట 113 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో తెలిపారు.



# అక్టోబర్ 2,3,4 తేదీల్లో క్రెడాయ్ హోమ్ ఎక్స్ పో

ఇల్లు కట్టుకోవాలన్నా, అపార్ట్ మెంట్ కొనుక్కోవాలన్నా అందుబాటులో సమగ్ర వివరాలు - అధునాతన ఐటమ్స్‌తో 130స్టాల్స్ ఏర్పాటు

నిర్మాణ రంగ అభివృద్ధికి నిబంధనలు సరళతరం చేసిన ప్రభుత్వం - విలేకరుల సమావేశంలో వెల్లడించిన క్రెడాయ్ ప్రతినిధులు





**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇల్లు కట్టుకోవాలన్నా, అపార్ట్‌మెంట్ కొనుక్కోవాలన్నా , ఉన్న ఇంటిని మార్చుకోవాలన్నా అందుకు అవసరమైన సమగ్ర వివరాలతో అక్టోబరు 2,34తేదీల్లో జెఎన్ రోడ్డులోని చెరుకూరి వీర్రాజు, సుబ్బలక్ష్మి కన్వేషన్ సెంటర్ లో మూడు రోజులపాటు హోమ్ ఎక్స్ పో నిర్వహిస్తున్నట్లు క్రెడాయ్ ప్రతినిధులు వెల్లడించారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో క్రెడాయ్ రాష్ట్ర చైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్, రాజమహేంద్రవరం చాప్టర్ చైర్మన్ సూరవరపు శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ మన్యం సంతోష్ ఫణికుమార్, జనరల్ సెక్రటరీ చల్లా బాల మురళికృష్ణ, ఎన్విరాన్ మెంట్ కమిటీ మెంబర్ కర్రి శేఖర్ రెడ్డి బుధవారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. ప్రతి రెండేళ్లకోసారి ఎక్స్ పో నిర్వహిస్తున్నామని ఆవిధంగా ఇప్పటికే నిర్వహించిన ఐదు ఎక్స్ పో లకు మంచి స్పందన వచ్చిందని వారు గుర్తుచేసారు. గతంలో 90స్టాల్స్ పెడితే, ఈసారి 130 స్టాల్స్ తో భారీగా ఎక్స్ పో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎక్స్ పో లో రకరకాల అధునాతన ఐటమ్స్ ఉంటాయని, అదేవిధంగా బిల్డర్స్, ఆర్కిటెక్ట్స్, డైజనర్స్, ఇలా అన్ని విభాగాలు ఒకే గొడుగు కింద అందుబాటులో ఉండడం వలన సొంతిల్లు సమకూర్చుకోవాలని వచ్చేవారికి వెసులుబాటు లభిస్తుందని, సమయం కూడా ఆదా అవుతుందని వివరించారు. ప్రతీ గంటగంటకు లక్కీ డీప్ నిర్వహిస్తామని తెలిపారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఎక్స్ పో ప్రారంభోత్సవానికి హాజరవుతారని తెలిపారు. ఈ ఎక్స్ పో సందర్శించి విజయవంతం చేయాలని ప్రజలకు వారు విజ్ఞప్తి చేసారు. నిర్మాణ రంగం గురించి బుడ్డిగ శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించే చర్యలు చేపట్టారని చెప్పారు. క్రెడాయ్ ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని నిబంధనలు సరళతరం చేస్తూ, ప్రత్యేక జీవోలు కూడా ప్రభుత్వం జారీ చేసిందని ఆయన తెలుపుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, మంత్రులు లోకేష్, పి.నారాయణలకు, అలాగే ఇతర మంత్రులకు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. రెరా రాకముందే క్రెడాయ్ స్వచ్ఛందంగా కొన్ని నిబంధనలు ఏర్పాటుచేసుకుని వాటిని అమలు చేస్తోందని ఆయన గుర్తుచేసారు. ఖాతాదారులకు ఇచ్చిన మాట ప్రకారం నిర్మాణం పూర్తిచేసి అప్పగిస్తున్నామన్నారు. ఒకవేళ ఎక్కడైనా తేడా జరిగితే కూర్చోబెట్టి సెటిల్ చేస్తున్నామన్నారు. అందుచేత క్రెడాయ్ సభ్యులకు రెరా నిబంధనలు పాటించడం మరింత సులువు అయిందన్నారు. పరిసర ప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజి వంటి కనీస సదుపాయాలు కల్పించి, మాస్టర్ ప్లాన్ అమలు చేయడం వలన అక్కడ నిర్మాణాలు వేగవంతం అవుతాయని, ఖర్చు కూడా తగ్గుతుందని బుడ్డిగ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. ఇల్లు కట్టుకోవాలనుకునేవాళ్ళు స్థలం కొనుక్కోడానికి వీలుగా రేట్లు ఉంటేనే అభివృద్ధి ఉన్నట్లుగా భావించాలేతప్ప , ఇపుడు గజం లక్ష రూపాయలకు కొనేసి, ఆర్నెల్లు పోయాక రెండు లక్షల ధర పలకాలనుకోవడం అభివృద్ధి కాదని ఆయన స్పష్టంచేసారు. క్రెడాయ్ రాజమహేంద్రవరం ఉపాధ్యక్షుడు రెడ్డి రామకృష్ణ, కోశాధికారి టివిఎల్ నరసింహారావు, కార్యవర్గ సభ్యులు యెజ్జు శ్రీనివాస కిరణ్, బళ్లా వర ప్రసాద్, రుత్తల అనిల్, కోన మోహన్ రావు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## అనుమతిలేని నిర్మాణాలపై

# ఉక్కుపాదం

సాయిదుర్గానగర్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేత..

టింబర్‌యార్డు రోడ్డులో ర్యాంపులు, ప్లాట్‌ఫామ్‌ల తొలగింపు





**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో అనుమతిలేని నిర్మాణాలపై నగరపాలక సంస్థ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో బుధవారం పలు ప్రాంతాల్లో అనధికార నిర్మాణాలను తొలగించారు. సాయిదుర్గానగర్‌లో నగరపాలక సంస్థ నుంచి ఎలాంటి అనుమతి పొందకుండా చేపట్టిన నిర్మాణాన్ని అధికారులు కూల్చివేశారు. భవన నిర్మాణాలకు ముందుగా నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన వారు స్వచ్ఛందంగా వాటిని తొలగించుకోవాలని తెలిపారు. లేకపోతే నగరపాలక సంస్థ సిబ్బందితో వాటిని పూర్తిగా తొలగిస్తామని స్పష్టం చేశారు. నగరంలో అనధికార నిర్మాణాలతో పాటు అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ప్రకటన బోర్డుల తొలగింపు ప్రక్రియను కూడా కొనసాగిస్తామని కమిషనర్ తెలిపారు. అవసరమైతే అదనపు యంత్రాలు, సిబ్బందిని సమకూర్చుకుని చర్యలను వేగవంతం చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. వార్డు సచివాలయాల పరిధిలో అనుమతిలేని నిర్మాణాలు, ప్రకటన బోర్డులను ఇప్పటికే గుర్తించినట్లు తెలిపారు. వాటిని రూపొందించిన కార్యాచరణ ప్రకారం దశలవారీగా తొలగిస్తామని స్పష్టం చేశారు. నగరంలో రహదారులు, కాలువలు, ప్రజా స్థలాలకు ఇబ్బంది కలిగించే నిర్మాణాలపై కూడా పరిశీలన కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా టింబర్‌యార్డు రోడ్డులో రహదారిపైకి చొచ్చుకొచ్చిన ర్యాంపులు, వేదికలను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు బుధవారం తొలగించారు. రహదారి విస్తీర్ణాన్ని ఆక్రమించే విధంగా నిర్మాణాలు చేపట్టరాదని అధికారులు సూచించారు. నగరంలో నిర్మాణాలు చేపట్టే సమయంలో ప్రజలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని కమిషనర్ కోరారు. సంబంధిత అనుమతులు పొందిన తరువాతే భవన నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ప్రణాళికాబద్ధమైన నగర అభివృద్ధికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు

31 ప్రమాదకర ప్రాంతాలు.. 12 అధిక ప్రమాద ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి - పుష్కరాల వేళ ట్రాఫిక్ నియంత్రణకు సమగ్ర ప్రణాళిక

తక్షణం అమలు చేయగల తక్కువ వ్యయ చర్యలకు ప్రాధాన్యం : జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడి లోపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రహదారి భద్రత విషయంలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం లోని కలెక్టర్ శిబిర కార్యాలయంలో బుధవారం సాయంత్రం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని జాతీయ రహదారులు, ప్రధాన రహదారులపై ప్రమాదాల నివారణ, వెలుగుల ఏర్పాటు, ప్రమాదకర ప్రాంతాల్లో చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించారు. గత సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు వివిధ శాఖలు చేపట్టిన చర్యలను పరిశీలించారు. జిల్లాలో 31 ప్రమాదకర ప్రాంతాలు, 12 అధిక ప్రమాద ప్రాంతాలు గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలకు కారణాలను క్షేత్రస్థాయిలో విశ్లేషించి అవసరమైన భద్రతా చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు జిల్లాలో 242 రహదారి ప్రమాదాలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. వీటిలో 84 ద్విచక్ర వాహన ప్రమాదాలు కాగా.. లారీల కారణంగా 45, కార్ల కారణంగా 27 ప్రమాదాలు జరిగినట్లు వివరించారు. రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య 77 ప్రమాదాలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. బొమ్మూరు, రాజానగరం, కోరుకొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రమాదాలు ఎక్కువగా నమోదవుతున్నట్లు తెలిపారు. జిల్లాలో జరిగిన మొత్తం ప్రమాదాల్లో దాదాపు 40 శాతం జాతీయ రహదారులపైనే చోటుచేసుకున్నట్లు వివరించారు.

### వెలుగులు లేకే ప్రమాదాలు

ఏడీబీ రహదారి కూడలి వద్ద రాత్రివేళ తగినంత వెలుతురు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో అక్కడ తక్షణమే తాత్కాలిక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. గామన్ వంతెన నుంచి కేశవరం, శూన్య బిందువు వరకు ఉన్న ప్రమాదకర ప్రాంతాల్లో వెలుగులు, రహదారి గుర్తుల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సూచించారు. జాతీయ రహదారుల వెంబడి వెలుగుల వ్యవస్థ ఏర్పాటుకు పంచాయతీల పరిధిలో ఉన్న స్థలాలను త్వరితగతిన జాతీయ రహదారుల సంస్థకు అప్పగించాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. లాలాచెరువు, బొమ్మూరు, వేమగిరి తదితర కీలక ప్రాంతాల్లో వెలుగుల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ప్రతి ప్రమాద మరణంపై క్షేత్రస్థాయి పరిశీలన రహదారి ప్రమాదంలో మరణం సంభవించిన ప్రతి ప్రాంతాన్ని సంబంధిత డీఎస్పీ, ఆర్అండ్‌బీ లేదా జాతీయ రహదారుల ఇంజినీర్లు, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ప్రమాదానికి దారితీసిన రహదారి నిర్మాణ లోపాలు, ఇతర సాంకేతిక కారణాలను గుర్తించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రమాదాల నివారణకు భారీ వ్యయంతో కూడిన పనుల కంటే తక్షణమే అమలు చేయగల తక్కువ వ్యయ చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. వెలుతురు లేని ప్రాంతాల్లో దీపాలు ఏర్పాటు చేయడం, అవసరమైన చోట రహదారి సూచిక బోర్డులు, రబ్బరు అడ్డుకట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. మధ్య విభజన లేని ప్రాంతాల్లో ప్రమాదకరంగా వాహనాలను దాటించే పరిస్థితులను నియంత్రించేందుకు ఇనుప స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

### పుష్కరాలకు ప్రత్యేక ప్రణాళిక

రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు, వాహనాలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, ప్రమాదాల నివారణ, భక్తులకు సురక్షిత రాకపోకల కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి స్పష్టమైన ప్రణాళిక పటం సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రధాన రహదారులు, పుష్కర ఘాట్లు, కూడళ్లు, వాహనాల నిలుపుదల ప్రాంతాలు, ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే గుర్తించాలని తెలిపారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం, అవసరమైన చోట ట్రాఫిక్‌ను మళ్లించడం, అత్యవసర వాహనాలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలను ముందుగానే ఖరారు చేయాలని సూచించారు. పుష్కరాల సమయంలో అవసరమైన వెలుగులు, సూచిక బోర్డులు, అడ్డుకట్టలు, నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ట్రాఫిక్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ రద్దీ పెరిగిన వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేలా పోలీసు, రవాణా, ఆర్అండ్‌బీ, నగరపాలక సంస్థ, పంచాయతీరాజ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

### వేగ నియంత్రణపై దృష్టి

గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ రహదారులను అనుసంధానించే చేరిక రహదారుల వద్ద రంబుల్ స్ట్రిప్‌లు, మెరుస్తూ కనిపించే దీపాలు, విద్యుత్ వెలుగులు వంటి భద్రతా సదుపాయాలను పంచాయతీ నిధులతో ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మితిమీరిన వేగాన్ని నియంత్రించేందుకు జాతీయ రహదారులపై వాహనాల నంబర్లను స్వయంచాలకంగా గుర్తించే కెమెరాలు, వేగ నియంత్రణ పరికరాల ఏర్పాటును పరిశీలించాలని సూచించారు.

### బొమ్మూరు, రాజానగరంలో అధిక ప్రమాదాలు

జిల్లా ఎస్పీ డి. నరసింహ కిశోర్ మాట్లాడుతూ జాతీయ రహదారులపై బొమ్మూరు, రాజానగరం, దేవరపల్లి, కడియం, నల్లజర్ల, రంగంపేట మండలాల పరిధిలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నట్లు తెలిపారు. వెలుగులు సరిగా లేకపోవడం, సూచిక బోర్డుల కొరత, చేరిక రహదారుల వద్ద వేగ నియంత్రణ ఏర్పాట్లు లేకపోవడం, హెల్మెట్ వినియోగించకపోవడం తదితర కారణాలు ప్రమాదాలకు దారితీస్తున్నాయని వివరించారు.

నిబంధనలు ఉల్లంఘించే వాహనాలకు స్వయంచాలకంగా జరిమానా నోటీసులు జారీ చేయడంతో పాటు, లారీల అధిక బరువు రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రమాదాలకు సంబంధించిన వివరాలను పోలీసులు నమోదు చేస్తున్నారని, రవాణా, నగరపాలక సంస్థల అధికారులు కూడా తమ పరిధిలోని సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు.

### రహదారుల వెంబడి ధాబాలపై నిఘా

గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని రహదారుల ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేస్తున్న ధాబాలపై కూడా దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. ధాబాలకు వచ్చే వాహనాలను రహదారులపై నిలపడం వల్ల ప్రమాదాల అవకాశాలు పెరిగే అవకాశం ఉన్నందున నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్, జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి, పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణ ఇంజినీర్ కే. బాలకృష్ణతో పాటు పోలీసు, రవాణా, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారులు, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

యాభైవేల రూపాయలతో పుష్కర కాలువకు

# ఇనుపమెట్లు ఏర్పాటు : సర్పంచ్ అభ్యర్థి రాజేష్

రాజేష్‌కు రైతులు కృతజ్ఞతలు



**కోరుకొండ, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని నరసాపురం కనుపూరు తదితర గ్రామాల రైతుల సౌకర్యార్థం పుష్కర కాలువకు సుమారు యాభైవేల రూపాయల సొంత నిధులతో ఇనుపమెట్లు ఏర్పాటు చేసినట్లు నరసాపురం సర్పంచ్ అభ్యర్థి కోర్పు రాజేష్ తెలిపారు. బుధవారం పుష్కర కాలువ వద్ద రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఇనుపమెట్లను గ్రామస్తులు, రైతులతో మెట్లను ఘనంగా ప్రారంభించారు. ఈ నందర్భంగా పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, నరసాపురం, కనుపూరు తదితర గ్రామాల రైతులు రాజేష్‌ని అభినందిస్తూ, కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పీతా శ్రీనుబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు గుర్రం ఈశ్వరరావు, కోర్పు లక్ష్మణరావు, నీలపాల రామకృష్ణ, బొల్లెంపల్లి సత్యనారాయణ, మందల జంగం, మాత నూకరాజు, పలువురు మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మండలాల అభివృద్ధికి

# జెడ్పీటీసీల సేవలు అద్వితీయం : విప్పర్తి

కర్రికి ఘన సత్కారం



**కోరుకొండ, సెప్టెంబర్ 23, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలాల అభివృద్ధిలో జడ్పిటిసిలు సేవలు అద్వితీయమని ఉభయ జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు విప్పర్తి వేణుగోపాల్ అన్నారు. బుధవారం కాకినాడ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా ప్రజా పరిషత్ కార్యవర్గం పదవికాలం నేటితో పూర్తి కావడంతో వారి సేవలను కొనియాడుతూ, జిల్లా ప్రజా పరిషత్ కార్యవర్గం, అధికారుల ఆధ్వర్యంలో జడ్పిటిసిలకు పూలమాలవేసి సాల్వో ఘనంగా సత్కరిస్తూ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోరుకొండ జడ్పిటిసి కర్రి నాగేశ్వరరావు సేవలను కొనియాడుతూ పూలమాలలు వేసి సాల్వతో ఘనంగా సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు జిల్లా ప్రజా పరిషత్ కార్యవర్గానికి, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు విప్పర్తి వేణుగోపాల్, జిల్లా ప్రజా పరిషత్ సీఈవో వివివిఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో శ్రీలత, కార్యవర్గం, ఉన్నతాధికారులు, వాసంశెట్టి పెద్ద వెంకన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

# తిరుమల బ్రహ్మోత్సవాల్లో టాలీవుడ్ హీరోయిన్

## కూచిపూడి నాట్యంతో ఆకట్టుకున్న ముద్దుగుమ్మ



ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న హీరోయిన్స్ చాలా మంది ఉన్నారు. అందులో ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న ముద్దుగుమ్మ ఒకరు. అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకుల హృదయాలు దోచుకున్న ఈ అమ్మడు..ప్రస్తుతం సరైన బ్రేక్ కోసం వెయిట్ చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా ఓ హీరోయిన్ లేటేస్ట్ వీడియో ఇప్పుడు వైరలవుతుంది. టాలీవుడ్ హీరోయిన్ డింపుల్ హయాతి కూచిపూడి నృత్యంతో ఆకట్టుకున్నారు. తిరుమల సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆమె ప్రదర్శన ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరలవుతుంది. ఆ వీడియోలో డింపుల్ వివిధ నాట్య భంగిమలు, ఫేస్ ఎక్స్ప్రెషన్స్ అలరించారు. కాగా డింపుల్ నిన్న తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఇన్నాళ్లు సినిమాలు, యాక్టింగ్, గ్లామరస్ నటనతో మెప్పించిన డింపుల్ లో ఈ టాలెంట్ కూడా ఉందా అంటూ ఆశ్చర్యపోతున్నారు నెటిజన్స్. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఎంతో అందంగా, చూడటానికి కనుల విందుగా నాట్యంతో ఆకట్టుకున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. సినిమాల విషయానికొస్తే ప్రస్తుతం ఆమె త్రివిక్రమ్ దర్శకత్వంలో విక్టరీ వెంకటేశ్ హీరోగా తెరకెక్కుతోన్న 'ఆదర్శ కుటుంబం'లో నటించారు. ఈ మూవీ అక్టోబర్ 9న రిలీజ్ కానుంది. సౌత్ ఇండస్ట్రీలో కథానాయికగా మంచి గుర్తింపు తెచ్చుకుంది డింపుల్ హయాతి. తెలుగుతోపాటు తమిళంలనూ పలు చిత్రాల్లో నటించి మెప్పించింది. వరుణ్ తేజ్ నటించిన గద్దలకొండ గణేష్ చిత్రంలో జర్రా జర్రా అనే స్పెషల్ పాటతో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఆత్రంగి రే, వీరమే వాగై సూడుమ్, ఖిలాడి, రామబాణం, భర్త మహాశయులకు విజ్ఞప్తి వంటి చిత్రాల్లో నటించింది.

# తల్లి అవ్వాలంటే పెళ్లే చేసుకోవాల్సిన అవసరం లేదు..

## చాలా మార్గాలు ఉన్నాయంటున్నా స్టార్ హీరోయిన్

రీసెంట్ డేస్ లో సినిమా ఇండస్ట్రీలో పెళ్లి బాజాలు గట్టిగానే వినిపిస్తున్నాయి. అయితే నాలుగు పదుల వయసులోనూ పెళ్లి మాట ఎత్తకుండా ఉన్న హీరోలు చాలా మంది ఉన్నారు. కుర్ర హీరోలు అందరూ పెళ్లి చేసుకొని కొత్త లైఫ్ ను ఎంజయ్ చేస్తుంటే.. మరికొంతమంది మాత్రం సింగిల్ గానే ఉంటూ సోలో బ్రతుకే సో బెటర్ అంటున్నారు. సినీ ఇండస్ట్రీలో కొందరు హీరోయిన్లు తమ అందం, అభినయంతో ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంటారు. మరికొందరు మాత్రం తమ వ్యక్తిగత అభిప్రాయాలతోనూ తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. అలాంటి వారిలో ఈ స్టార్ హీరోయిన్ కూడా ఒకరు. స్టార్ హీరో కుమార్తెగా సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె.. నటిగా మాత్రమే కాకుండా సింగర్‌గా కూడా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ తనకంటూ మంచి క్రేజ్ సంపాదించుకుంది. ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్న ఈ భామ.. మరోవైపు తన గాత్రంతోనూ ప్రేక్షకులను అలరిస్తోంది. అయితే తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా వివాహం, తల్లి కావాలనే కోరికపై ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఆమె మరెవరో కాదు అందాల భామ శ్రుతిహాసన్. బాలీవుడ్ నటి సోహా అలీఖాన్ నిర్వహిస్తున్న పాడ్‌కాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్న శ్రుతిహాసన్.. తన వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. తల్లి కావాలంటే తప్పనిసరిగా పెళ్లి చేసుకోవాల్సిందేనా.? అనే ప్రశ్నపై శ్రుతిహాసన్ తన అభిప్రాయాన్ని వెల్లడించింది. తల్లిగా మారేందుకు పెళ్లి చేసుకోవాల్సిన అవసరం ఏముంది.? తల్లి కావాలంటే వివాహం తప్పనిసరా అనే ప్రశ్న నాలో మొదలవుతోంది. ప్రస్తుతం తల్లి కావడానికి ఎన్నో మార్గాలు అందుబాటులో ఉన్నాయి. పిల్లలను దత్తత తీసుకోవడానికి కూడా నేను సిద్ధంగా ఉన్నాను. అదే సమయంలో నా జీవన విధానంలో భాగంగా సహజంగా కూడా తల్లి కావాలని కోరుకుంటున్నాను" అని ఆమె చెప్పుకొచ్చింది. అయితే పెళ్లి వ్యవస్థకు తాను పూర్తిగా వ్యతిరేకం కాదని కూడా ఈ సందర్భంగా క్లారిటీ ఇచ్చింది శ్రుతిహాసన్. తన పెళ్లిపై వస్తున్న చర్చలకు కూడా ఈ స్టార్ హీరోయిన్ స్పందించింది. తన వయసు 40కి చేరువవుతున్నప్పటికీ తాను ఇంకా సింగిల్‌గానే ఉన్నానని తెలిపింది. అయితే తన జీవితంలో సరైన భాగస్వామి కోసం ఎదురుచూస్తున్నానని చెప్పింది శ్రుతి. "నాకు వివాహ వ్యవస్థపై వ్యతిరేకత లేదు. నా జీవితంలో నాకు తోడుగా ఉండే భాగస్వామి కోసం ఎదురుచూస్తున్నాను. ఎప్పుడూ ఒకే చోట ఇమిడిపోయే వ్యక్తిని కాదు. నా జీవితాన్ని నా ఇష్టప్రకారం జీవించాలని కోరుకుంటాను. కొన్ని విషయాల్లో నేను సంప్రదాయబద్ధంగా ఉంటాను. మరికొన్ని విషయాల్లో పాత పద్ధతులను పాటిస్తాను. అయితే అవన్నీ నా ఇష్టంతోనే చేస్తాను. ఎవరూ నాపై బలవంతం చేయరు" అని శ్రుతిహాసన్ చెప్పుకొచ్చింది. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. ఈ ముద్దుగుమ్మ చేసిన కామెంట్స్ పై నెటిజన్స్ రకరకాలుగా రియాక్ట్ అవుతున్నారు.



# ఆ ఏరియాల్లో నాని ర్యాంపేజ్.. 'ది ప్యారడైజ్'తో బెస్ట్ ఓపెనింగ్స్..!

న్యాచురల్ స్టార్ నాని తమిళ ప్రేక్షకుల్లో కూడా మంచి ఆదరణ సంపాదించుకున్నాడు. ప్రతి సినిమాతోనూ తమిళనాడులో ఆయన తనకంటూ ఒక సొంత ఫ్యాన్ బేస్‌ను ఏర్పరచుకున్నాడు. ప్రస్తుతం 'ది ప్యారడైజ్' చిత్రానికి సంబంధించి చెన్నైలో బుకింగ్స్ అద్భుతంగా ఉన్నాయి. ప్రీమియర్లతో కలిపి ఈ సినిమా అక్కడ ఇప్పటికే రూ.1 కోటి మార్కును దాటేసింది. నాని కెరీర్‌లోనే ఇది అతిపెద్ద చెన్నై ఓపెనింగ్‌గా నిలిచింది. అటు కర్ణాటకలోనూ ఈ సినిమాకు ఇదే స్థాయి స్పందన లభిస్తోంది. కేవలం అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలోనే (ప్రీమియర్లతో కలిపి) రూ.3.25 కోట్ల వసూళ్లను సాధించి, ఈ ప్రాంతంలో కూడా నాని కెరీర్‌లోనే హయ్యెస్ట్ ఓపెనింగ్‌ను నమోదు చేసింది. గ్లోబల్‌గా చూస్తే, ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.50 కోట్ల అడ్వాన్స్ కలెక్షన్లతో మీడియం రేంజ్ హీరోల చిత్రాల్లోనే బిగ్గెస్ట్ ఓపెనర్‌గా 'ది ప్యారడైజ్' అవతరించింది. రాబోయే రోజుల్లో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఇంకా ఎంతటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.




# బ్యాడ్మింటన్‌లో కాంస్యంతో సరి..

## ఫైనల్‌కు చేరిన రోషిబిన



ఆసియా క్రీడల్లో నాలుగో రోజు భారత్‌కు నాలుగు పతకాలు వచ్చాయి. వెయిట్ లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను రజతం గెలుచుకోగా.. స్కీట్ పురుషుల, మహిళల విభాగంలో కాంస్యాలు వరించాయి. తాజాగా భారత్ ఖాతాలో మరో కాంస్యం వచ్చి చేరింది. బ్యాడ్మింటన్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో భారత్ సెమీస్‌లో ఓడిపోయింది. దీంతో కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. వుషు అథ్లెట్ రోషిబిన అద్భుతం చేసింది. వరుసగా రెండోసారి ఆసియా గేమ్స్ ఫైనల్‌కు చేరుకుంది. గత ఎడిషన్‌లో రోషిబిన రజతం నెగ్గింది. అంతకుముందు 2018లో కాంస్యం సాధించింది.

**చైనా చేతిలో ఓటమి..**

సెమీస్‌లో భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టుకు తీవ్ర పోటీ ఎదురైంది. డిఫెండింగ్ ఛాంపియన్ చైనా ముందు నిలవలేకపోయింది. చివరికి 1-3 తేడాతో భారత్‌పై చైనా విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో లక్ష్య సేన్ ఓడిపోగా. సాత్విక్ - చిరాగ్ శెట్టి అద్భుతంగా ఆడి తొలి డబుల్స్‌లో గెలిచారు. అయితే, రెండో డబుల్స్‌తోపాటు సింగిల్స్‌లో భారత ప్లేయర్లు తేలిపోయారు. సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి.. డబుల్స్‌లో అర్జున్ - హరిహరణ్ కూడా ఓటమితో భారత్ సెమీస్‌లోనే వెనుదిరిగింది. దీంతో చైనా ఫైనల్‌కు చేరుకుంది.

**కబడ్డీలో సెమీస్‌కు..**

పురుషుల కబడ్డీ టీమ్ అదరగొట్టేస్తోంది. హ్యాట్రిక్ విజయాలతో సెమీస్‌కు దూసుకెళ్లింది. దీంతో పతకం ఖాయం చేసుకుంది. గ్రూప్ స్టేజ్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. ఏ దశలోనూ ప్రత్యర్థికి అవకాశం ఇవ్వలేదు. చివరికి 48-25 తేడాతో భారత్ విజయం సాధించింది. ప్రస్తుతం భారత్ ఖాతాలో 11 పతకాలు ఉన్నాయి. అందులో ఒక స్వర్ణం, ఐదు రజతాలు, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి. పట్టికలో 13వ స్థానంలో ఉంది. చైనా (58), జపాన్ (48), దక్షిణ కొరియా (29), కజక్‌స్తాన్ (14), థాయ్‌లాండ్ (6) టాప్ -5లో కొనసాగుతున్నాయి.

### స్విమ్మింగ్ సంచలనం..

# 13 ఏళ్ల వయసులోనే హ్యాట్రిక్ గోల్డ్ మెడల్స్



ఆసియా క్రీడల్లో ఓ చిచ్చరపిడుగు అదరగొట్టేస్తోంది. కేవలం 13 ఏళ్ల వయసులోనే హ్యాట్రిక్ సాధించి ఔరా అనిపించింది. పతకాలే కాదండోయ్.. రికార్డులనూ సరి చేస్తూ దూసుకుపోతోంది. ఇంతకీ ఆమె ఎవరంటారా? ఆ చైనా చిన్నారి పేరు యు జిడి. ఈమె దూకుడు చూస్తుంటే రాబోయే ఒలింపిక్స్‌లోనూ పెను సంచలనాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుందేమో. ఆసియా క్రీడల్లో చైనా దూకుడు కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే హాఫ్ సెంచరీ పతకాల మైలురాయిని దాటేసింది. బంగారు పతకాలే 36 కాగా.. అందులో మూడింటిని 13 ఏళ్ల యువ స్విమ్మర్ యు జిడి ఖాతాలో వేసుకుంది. తాజాగా 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఈవెంట్‌లో అత్యుత్తమ టైమింగ్‌తో విజేతగా నిలిచింది. ఈ పోటీని ఆమె 4 నిమిషాల 28.56 సెకన్లలో పూర్తి చేసింది. దీంతో గత ఆసియా క్రీడల రికార్డును 4.5 సెకన్ల వ్యత్యాసంతో బద్దలు కొట్టింది. 2014 ఎడిషన్‌లో చైనాకు చెందిన యె షివెన్ స్వర్ణం నెగ్గింది. అంతకుముందు యు జిడి 200 మీ. బటర్‌ఫ్లై, 200 మీ. వ్యక్తిగత మెడ్లే విభాగాల్లోనూ గోల్డ్ మెడల్స్‌ను కైవసం చేసుకుంది.

**అప్పట్నుంచే హైలైట్..**

గతేడాది వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో యు జిడి పతకం సాధించింది. అప్పుడామె వయసు కేవలం 12 ఏళ్లే. చైనా రిలే జట్టులో సభ్యురాలైన యు కాంస్య పతక విజేతగా నిలిచింది. ఈ ఏడాది మార్చిలో అమెరికాకు చెందిన ఒలింపిక్ ఛాంపియన్ రెగాన్ స్మిత్‌నూ ఓడించింది. ఇప్పుడు ఆసియా గేమ్స్‌లోనూ అదే దూకుడుతో పతకాలను సొంతం చేసుకుంటుంది.

# ఆసియా గేమ్స్.. భారత్‌ను ఇబ్బంది పెడుతున్న రూల్స్?

ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు అద్భుతంగా పోరాడుతున్నా.. అక్కడి రూల్స్ మాత్రం ఇబ్బంది పెడుతున్నాయి. అనుకున్న పతకాలను దూరం చేస్తూ నిరాశకు గురిచేస్తున్నాయి. మొన్నేమో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో సుచిక ఫైనల్ చేరుకోలేక కాంస్యంతోనే సరిపెట్టుకొంది. మళ్లీ ఇప్పుడు ఈ-ఫుట్‌బాల్ విభాగంలో 'రూల్' దెబ్బకు ఇంటిముఖం పట్టాల్సి వచ్చింది. భారత్ ఈ-స్పోర్ట్స్ జట్టు ప్రయాణం అత్యంత నిరాశాజనకంగా ముగిసింది. ఈ-ఫుట్‌బాల్ క్రీడలో గ్రూప్- ఎఫ్ నుంచి భారత్ బరిలోకి దిగింది. తన చివరి మ్యాచ్ కోసం మైదానంలోకి అడుగు పెట్టకుండానే విజయం సాధించింది. కానీ, అదే ఇప్పుడు భారత్ నిష్క్రమణకు కారణమైంది. మరి ఆసియా గేమ్స్ రూల్ ఆ విధంగానే ఉండటం గమనార్హం. డానియల్ పటేల్ - చిన్మయ్ సాహూ జోడీ చివరి మ్యాచ్ కోసం సిద్ధమైంది. కానీ, ప్రత్యర్థి మంగోలియా నిర్దేశించిన చెక్ ఇన్ సమయానికి చేరుకోకపోవడంతో 0-0తేడాతో భారత్‌కు వాకోవర్ విజయం లభించింది. గెలిచాం కదా! ఇంకేం.. ముందుకు వెళ్లొచ్చని భావిస్తే తప్పులో కాలేసినట్లే. ఈ ఫలితంతో తదుపరి రౌండ్లకు వెళ్లేందుకు అవసరమైన గోల్స్‌ను సాధించలేకపోయింది. దీంతో గ్రూప్ స్టేజ్ నుంచే నిష్క్రమించింది.

**రూల్ అలా ఉంది మరి..**

అయితే, ఈ విజయం తమకు అవసరం లేదని భారత జట్టు నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లింది. తాము బరిలోకి దిగుతామని కోరింది. కానీ, నిబంధన ప్రకారం.. ప్రత్యర్థి టీమ్ రాకపోతే వాకోవర్ ఇవ్వాల్సిందే. అధికారులు ఆ మేరకు భారత జట్టును విజేతగా ప్రకటించారు. కానీ, గోల్స్ తేడానే ప్రధాన సమస్యగా మారింది. అర్హత పోటీలో నిలవాలంటే భారత్‌కు భిన్నమైన వాకోవర్ స్కోరు అవసరమయ్యేదని పటేల్ అన్నారు.



**చెదిరిన కల..**

కనీసం గ్రూప్ స్టేజ్ దాటకుండానే వెనుదిరగడం భారత్ తీవ్ర నిరాశపరిచింది. మరీ ముఖ్యంగా డానియల్ పటేల్‌పై భారీ అంచనాలే ఉన్నాయి. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన ఫిఫా కాంటినెంటల్ ఛాంపియన్‌షిప్‌లో టైటిల్ గెలుచుకున్నాడు. ఆసియన్ ఈ-ఫుట్‌బాల్ మొబైల్ ఛాంపియన్‌గా ఇప్పుడు అడుగు పెట్టాడు. ఆసియా క్రీడల్లో పతకం సాధించి ఉంటే అరుదైన ఘనతను సొంతం చేసుకొనేవాడు..

**ఛాలెంజ్ చేయాలంటే..**

సాధారణంగా రివ్యూలు తీసుకొని సమీక్షించాలని కోరడం ఉంటుంది. కానీ, ఆసియా క్రీడల్లో ఫలితాన్ని ఛాలెంజ్ చేయాలంటే డబ్బులు చెల్లించాలి. ఈ-ఫుట్‌బాల్ జట్టు కూడా 500 డాలర్లను చెల్లిస్తేనే ఫార్మల్ రివ్యూ చేసేందుకు అవకాశం ఉంది. కానీ, గోల్ వ్యత్యాసం ఉండటంతో భారత్ ఆ దిశగా ఆలోచించలేదు. కానీ, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ అథ్లెట్ సుచిక కూడా 1000 డాలర్లు చెల్లించి మరీ రివ్యూ తీసుకుంది. అందులో ఆమె సక్సెస్ అయినా.. ఆసియా గేమ్స్ రూల్స్ ప్రకారం తన ప్రత్యర్థి కంటే ఎక్కువ బరువు ఉండటంతో సెమీస్‌లోనే నిష్క్రమించింది.

# క్రికెటర్ కాబోయి.. 'సాఫ్ట్'గా పతకం పట్టేసి

## ఆసియా గేమ్స్‌లో మీనా చరిత్ర



జై మీనా.. భారత క్రీడారంగం తన చరిత్రలో మరో కొత్త పేరును లిఖించుకుంది. మను బాకర్ ఏ పతకం తెస్తుందా..? అని అంతా ఎదురుచూస్తోన్న తరుణంలో దేశ ప్రజలకు పెద్దగా పరిచయం లేని సాఫ్ట్ టెన్నిస్‌లో ఆసియా క్రీడల వేదికగా జై మీనా భారత్‌కు తొలిపతకం అందించాడు. గెలిచింది కాంస్యమే అయినా.. మరో కొత్త క్రీడాంశంపై యువత దృష్టిసారించేలా చేశాడు. ఇంతకీ ఎవరీ జై మీనా..? మధ్యప్రదేశ్‌లోని దేవాస్‌కు చెందిన 24 ఏళ్ల జై మీనా.. సాఫ్ట్‌బాల్‌లో బుధవారం జరిగిన పురుషుల వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం దక్కించుకున్నాడు. సెమీఫైనల్‌లో జపాన్ ఆటగాడు టకుయా కురోసాకా చేతిలో 4-2..(3-5, 1-4, 1-4, 4-1, 6-4, 1-4) తేడాతో ఓడటంతో మూడోస్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 45 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఒక దశలో పుంజుకున్నట్లే కనిపించినా.. తర్వాత తడబడ్డాడు. అయినా సాఫ్ట్ టెన్నిస్ (రాశీటే వఅఅఅం)లో ఇది భారత్‌కు చరిత్రాత్మక విజయమే.

**బాల్‌బాయ్ నుంచి ఇంటర్నేషనల్ స్టార్‌గా..**

దేవాస్‌లోని పయనీర్ పబ్లిక్ స్కూల్‌లో జై మీనాకు ఈ సాఫ్ట్ టెన్నిస్ పరిచయమైంది. బాల్‌బాయ్‌గా ఉంటూ.. క్రికెటర్ కావాలని కలలు కంటున్న అతడిని ఈ ఆట ఎంతగానో ఆకట్టుకుంది. ఆ ఆసక్తి పెరిగి.. 14 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే స్థాయికి తీసుకువచ్చింది. 2022లో గుజరాత్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో బంగారం పతకం గెల్చుకున్న మీనా.. 2025లో పురుషుల సింగిల్స్‌లో జాతీయ ఛాంపియన్‌గా మారాడు. 2024లో భారత్‌కు తొలి అంతర్జాతీయ పతకాన్ని అందించాడు. ఆ ఏడాది జరిగిన వరల్డ్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్స్‌లో మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్యం దక్కించుకున్నాడు. 2025లో ఆసియాన్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్స్‌లోనూ కాంస్యం వచ్చింది. ఇతర టీమ్ ఈవెంట్లలో భారత్‌కు మూడు పతకాలు దక్కడంలో కీలక పాత్ర పోషించాడు.

**సాఫ్ట్ టెన్నిస్ అంటే..**

ఈ సాఫ్ట్ టెన్నిస్ కూడా మామూలుగా ఆడే టెన్నిస్‌లాగే ఉంటుంది. అయితే ఇందులో 6.6 సెం.మీ. పరిమాణం, 30 గ్రాముల బరువుతో డొల్లగా ఉండే ఒక రబ్బరు బంతిని ఉపయోగిస్తుంటారు. గాలి తీవ్రత దానిపై ప్రభావం చూపుతుంది. సాధారణ టెన్నిస్ బంతి కంటే ఈ బంతి ఈజీగా స్పిన్ అవుతుంటుంది. తేలిగ్గా ఉండే రాకెట్ కూడా.. ఎటంటే అటు వంగిపోతుంటుంది. ఈ క్రీడ 1800ల చివర్లో జపాన్‌లో ప్రారంభమై.. తర్వాత ఆసియా, తూర్పు ఐరోపా దేశాలకు విస్తరించింది. 1994లో దీనిని ఆసియా గేమ్స్‌లో ప్రవేశపెట్టారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com